

ఎల్జీ పాలిమర్స్ ఘటనలో 200 మందికి అందని సాయం
» విచారణకు కలెక్టర్ ఆదేశం ·8లో

'వరుణ్ బజాజ్'లో రూ.6 కోట్లు స్వాహా
» నలుగురు మేనేజర్ స్థాయి ఉద్యోగులు అరెస్టు ·8లో

నిస్తేజంగా అగ్నిమాపక కేంద్రాలు

నగరంలో ఉన్నవి నాలుగే...

జనాభా ప్రాతిపదికన చూస్తే ఉండాల్సినవి 44

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు	4
అందుబాటులో ఉన్న అగ్నిమాపక శకటాలు	10
ప్రస్తుతం ఉన్న సిబ్బంది	115
ఖాళీలు	60 (సుమారుగా)
గత ఏడాది అగ్ని ప్రమాదాలపై వచ్చిన ఫోన్‌కాల్స్	484

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- వాహనాల నిర్వహణకు నిధుల సమస్య
- తరచూ మరమ్మతులు
- రిపేరుకి నోచుకోక మూలకు చేరిన రెస్క్యూ టెండర్
- కాలం చెల్లిన మిస్ట్ జీపులు



సూర్యబాగ్ వద్ద ఉన్న అగ్నిమాపక కేంద్రం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అగ్నిమాపక శాఖ పరిస్థితి దయనీయంగా ఉంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ చేయకపోవడంతో సిబ్బంది కొరత వెంటాడుతోంది. కాలం చెల్లిన వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఫైర్ స్టేషన్లను పెంచకపోవడంతో ఉన్న వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న అగ్నిమాపక శాఖ ఈ వేసవికి ఎలా సన్నద్ధమైందోననే ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

జిల్లాలో పెదగంట్యాడ, మర్రిపాలెం, సూర్యాబాగ్, చిట్టివలసల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. సాధారణంగా ప్రతి 50 వేల మంది జనాభాకు ఒక అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) ఉండాలి. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే నష్టతీవ్రత పెరగకుండా ఉండేందుకు ప్రమాదం జరిగినట్టు సమాచారం అందుకున్న పది నిమిషాల్లోపే ఘటనా స్థలానికి అగ్నిమాపక శకటం (ఫైర్ టెండర్) చేరుకోవాలి. అంతకంటే ఎక్కువ సమయం పడితే నష్టం పెరిగే ప్రమాదం ఉంటుంది. దీని ప్రకారం చూస్తే 22 లక్షల మంది జనాభా ఉన్న విశాఖ నగరంలో 44 ఫైర్ స్టేషన్లు ఉండాలి. కానీ కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. అవి కూడా దశాబ్దాల కిందట ఏర్పాటుచేసినవే కావడంతో కొత్తగా ఆరు ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఉన్న నాలుగు కేంద్రాల్లో సూర్యాబాగ్, పెదగంట్యాడ, మర్రిపాలెంలో మూడు చొప్పున అగ్నిమాపక శకటాలు (ఫైర్ టెండర్లు) ఉండగా, చిట్టివలసలో మాత్రం ఒక్కటే ఉంది. ఇవికాకుండా ఎత్తైన భవనాల్లో అగ్ని ప్రమాదాలు ... మిగతా 6వ పేజీలో



వుడా పార్కింగ్ ప్రదేశంలో దగ్ధమవుతున్న కార్లు

వార్త 8లో



అగ్నిమాపక కేంద్రంలో పనిచేయని కటర్ వెహికల్

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

నాలుగేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం

- తొలి దశలో మూడు కారిడార్లు... » 46.23 కిలోమీటర్ల ట్రాక్
- రెండో దశలో కొమ్మాది-భోగాపురం విమానాశ్రయం కారిడార్
- మొదటి దశ నిర్మాణానికి రూ.11,498 కోట్లు అవసరం
- 100 శాతం గ్రాంటు కేంద్రాన్ని కోరుతున్నామన్న చంద్రబాబునాయుడు
- డబుల్ డెక్కర్ మోడల్‌లో నిర్మాణం
- వీఎంఆర్‌డీఏ భవనంలోకి మెట్రో రైలు కార్యాలయం



విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తికావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. విజయవాడలో దీనిపై ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున రెండింటికీ పరిష్కారం లభించేలా డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో ట్రాక్‌ల నిర్మాణం జరగాలన్నారు. తొలి దశలో 46.23 కి.మీ. ట్రాక్ వేస్తామని, ఇది మూడు కారిడార్లలో ఉంటుందని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ అధికారులు వివరించారు. రెండో దశలో నాలుగో కారిడార్ కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు ఉంటుందన్నారు. మొదటి దశ నిర్మాణానికి రూ.11,498 కోట్లు అవసరమని చెప్పగా, దీనికి 100 శాతం గ్రాంటు కేంద్రాన్ని కోరుతున్నామని, సానుకూల నిర్ణయం వస్తుందని సీఎం చంద్రబాబునాయుడు ఆశాభావం వ్యక్తంచేశారు. విశాఖ జిల్లా నుంచి హాజరైన అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా అందులో కేవలం తొమ్మిది ఎకరాలు మాత్రమే ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉందని, మిగిలిన భూమి అంతా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందినదేనని వివరించారు. భూసేకరణకు సుమారు రూ.882 కోట్లు అవసరం అవుతుందని వెల్లడించారు. తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ నిర్మించే కారిడార్‌లోనే ఎక్కువ ప్రైవేటు స్థలం సేకరించాల్సి ఉంటుందనే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ఆ మార్గంలో ఏడు మెట్రో స్టేషన్లు ఉంటాయని అధికారులు వివరించారు. అక్కడ షాపింగ్ మాల్స్ ... మిగతా 6వ పేజీలో

తహశీల్దార్ల కొరత

ఇన్‌చార్జులతో నడుస్తున్న కలెక్టరేట్‌లోని రెండు సెక్షన్లు

- మొత్తం నాలుగు ఖాళీలు
- రెండు, మూడు మండలాల తహశీల్దార్లపై ఫిర్యాదులున్నా... సమర్థులైన అధికారులు లేకపోవడంతో ఆచితూచి అడుగులేస్తున్న ఉన్నతాధికారులు
- అల్లూరి జిల్లా నుంచి ఇద్దరు తహశీల్దార్లను ఏడాదిగా రిలీవ్ చేయని వైనం



విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): **జిల్లాల విభజన తరువాత విశాఖకు తహశీల్దార్ల కొరత ఏర్పడింది. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత మండలాల సంఖ్య తగ్గినా పని భారం ఏ మాత్రం తగ్గలేదు. ప్రొటోకాల్, పలు పథకాల అమలు, నిరంతరం కోర్టులకు హాజరు వంటి అంశాలతో రెవెన్యూ శాఖ ఉక్కిరిబిక్కిరవుతుంది.**

ప్రస్తుతం జిల్లాలో నాలుగు తహశీల్దార్ పోస్టులు ఖాళీగా ఉండగా, మరో తహశీల్దార్ సెలవులో ఉన్నారు. కలెక్టరేట్‌లో నాలుగు సెక్షన్లు కీలకమైనవే. ప్రస్తుతం పాలన, భూ పరిపాలన సెక్షన్‌లకు మాత్రమే పూర్తిస్థాయి తహశీల్దార్లు ఉన్నారు. మెజిస్ట్రీరియల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎన్నికలు, ఇతర విభాగాలు ఇన్‌చార్జుల పర్యవేక్షణలో ఉన్నాయి. పూర్తిస్థాయి తహశీల్దార్లు లేకపోవడంతో ఉన్నవారిపైనే పని భారం పడుతోంది. అలాగే కలెక్టరేట్‌లో ప్రొటెక్షన్, జీవీఎంసీలో ఎస్టేట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంకా విశాఖ ఆర్డీవో కార్యాలయం ఏవో సెలవులో ఉన్నారు. వచ్చే జూలైలో కలెక్టరేట్ ఏవో, భూసేకరణ విభాగం తహశీల్దార్, భీమిలి ఆర్డీవో కార్యాలయ ఏవో పదవీ విరమణ చేయనున్నారు.

ఇదిలావుండగా జిల్లాలో ఇద్దరు, ముగ్గురు తహశీల్దార్లపై పలు రకాల ఫిర్యాదులున్నాయి. వీరి పనితీరుపై జిల్లా యంత్రాంగం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. రెండు మండలాల్లో భూ వివాదాలపై నిత్యం పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. మరో తహశీల్దార్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో అక్కడ డీటీపై భారం పడుతుంది. వారిని బదిలీ చేసి కొత్తవారిని నియమించాలంటే సమర్థులైన తహశీల్దార్ల కొరత ఉండడంతో యంత్రాంగం ఆచితూచి అడుగులేస్తోంది.

గత ఏడాది బదిలీల సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖకు ఇద్దరు తహశీల్దార్లను బదిలీ చేశారు. ఇప్పటివరకూ ... మిగతా 6వ పేజీలో

ఖాకీ వసూల్‌పై సీపీ సీరియస్

వివరాలు సేకరించి, నివేదిక ఇవ్వాలని డీసీపీలకు ఆదేశం!

- మద్యం వ్యాపారులను ఆరా తీసిన ఏసీబీ, ఇంటెలిజెన్స్



విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి పోలీసులు నెలవారీ వసూళ్లకు పాల్పడుతుండడంపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సీరియస్ అయ్యారు. ఈ మేరకు బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఖాకీ వసూల్' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని డీసీపీలను ఆదేశించినట్టు సమాచారం. అంతేకాకుండా స్పెషల్‌బ్రాంచి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పోలీస్‌శాఖలో జరిగే అవినీతిపై సమాచారం సేకరించలేకపోవడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను కమిషనరేట్ పరిధిలోని రెండు జోన్‌ల అధికారుల వాట్సాప్ గ్రూపుల్లో సీపీయే స్వయంగా పోస్ట్‌చేసినట్టు పోలీస్‌వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదిలాఉండగా మద్యం వ్యాపారులు, సిండికేట్లతో రహస్యంగా కుదుర్చుకున్న ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు!

'బాల సంజీవని'లో మార్పులు

- 2.0 పేరుతో అప్‌డేట్ చేసిన ప్రభుత్వం
- సాంకేతిక సమస్యతో వినియోగంలో ఇబ్బందులు
- వివరాలు అప్‌లోడ్ కావడం లేదంటున్న సిబ్బంది
- లబ్ధిదారులకు రేషన్ ఇచ్చేందుకూ తప్పని ఇక్కట్లు



అంగన్‌వాడీ కేంద్రం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): **అంగన్‌వాడీ సిబ్బందిని యాప్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే అమలుచేస్తున్న 'బాల సంజీవని' యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసి 2.0 పేరుతో ఈ నెల ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తెచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రేషన్ సరకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం యాప్‌లో మార్పులు చేసింది. అయితే మార్పులు చేసిన తరువాత యాప్ సరిగా పనిచేయడం లేదని, దీంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.**

జిల్లాలో 776 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అనేకచోట్ల యాప్ ఓపెన్ కావడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. కొన్నిచోట్ల యాప్ ఓపెన్ అయినప్పటికీ వివరాలు అప్‌లోడ్ కావడం లేదంటున్నారు. ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఫొటోలు తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేసిన తరువాతే రేషన్ అందించాల్సి ఉంది. అయితే కొన్ని కారణాలతో ఒక్కోసారి లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్నారని, అలాంటి సందర్భంలో వారికి సరకులు అందించడం కష్టమవుతోందని వాపోతున్నారు. అలాగే, కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో తీసే సమయంలో పిల్లలు కెమెరా వైపు చూడకపోతే వారి హాజరును యాప్ గుర్తించడం లేదంటున్నారు. ఉదాహరణకు ఒక కేంద్రంలో 30 మంది పిల్లలు ... మిగతా 6వ పేజీలో

భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు ఆత్మహత్య



కోరాడ నాగభూషణరావు (ఫైల్ ఫొటో)

ఆనందపురం, ఆరిలోవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన టీడీపీ మాజీ నాయకుడు కోరాడ నాగభూషణరావు (63) గురువారం ఉదయం ఆరిలోవ హెల్త్ సిటీలోని పినాకిల్ ఆస్పత్రి భవనం నాలుగో అంతస్థు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన గుండె సంబంధిత వ్యాధితో ఈ నెల ఎనిమిదో తేదీన ఆస్పత్రిలో చేరారు. హై బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారు. మానసిక పరిస్థితి కూడా బాగుండలేదని, బుధవారం సంబంధిత వైద్యులు కూడా పరీక్షించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సమాచారం అందిన వెంటనే ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


రాజకీయ కుటుంబం

నాగభూషణానిది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. ఆయన తండ్రి అప్పలస్వామినాయుడు వేములవలస ... మిగతా 6వ పేజీలో

చందనోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

- కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశం
- 30న ఉత్సవం
- 29న సాయంత్రం 6 గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేత



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన జరగనున్న సింహాచలం వరాహలక్ష్మీనరసింహస్వామి చందనోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. చందనోత్సవ ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. టికెట్ల విక్రయం నుంచి వాహనాల నిర్వహణ వరకూ ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేయాలన్నారు. భక్తుల కోసం రూ.1000, రూ.300 టికెట్ల విక్రయాలను అనుకూల ప్రాంతాల్లో చేపట్టాలన్నారు. కొండపైకి వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పాస్‌లు జారీచేయాలన్నారు. భక్తుల రవాణా కోసం తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. తాగునీటి, మజ్జిగ కేంద్రాలు, మరుగుదొడ్లు, వైద్య కేంద్రాలు, విస్తృతంగా ఏర్పాటుచేయాలన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ చందనోత్సవానికి సంబంధించి కొండపైన, దిగువన, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కోసం అదనపు స్థలాలు కేటాయించాలన్నారు. సమావేశంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీలు అజితా వేజెండ్ల, మేరి ప్రశాంతి, డీఆర్వో భవానీ శంకర్, సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో నగర వనం

- రూ.2 కోట్లతో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, యాంపీ థియేటర్ ఏర్పాటుకు అటవీశాఖ ప్రతిపాదన

విశాఖపట్నం/సాగర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్‌లో నగర వనం ఏర్పాటుకు అటవీ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఇందుకు సుమారు రెండు కోట్ల రూపాయలు వ్యయం చేయనున్నారు. విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో సముద్ర తీరం వైపు అటవీ శాఖకు సుమారు 50 ఎకరాలు (జూ వెనుక గేటు నుంచి రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్ వరకూ) ఉంది. సాగర్‌నగర్ ముఖద్వారం ఎదురుగా షెల్టర్ బెల్టులో సరుగుడు తోటలు వేశారు. ఆ పక్కనే ఉన్న సుమారు 20 ఎకరాల్లో నగర వనాన్ని ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. సాగర్‌నగర్‌తో పాటు దానికి ఆనుకుని ఉన్న కాలనీల ప్రజల కోసం నగరవనంలో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, యాంపీ థియేటర్, యోగా సెంటర్, కేఫిటేరియా, తదితర సదుపాయాలను కల్పించాలని అధికారులు నిర్ణయించారు. చెట్ల పెంపకాన్ని కూడా చేపడతారు. స్థానికంగా ఉండే వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో నగర వనాలను నిర్వహిస్తారు. ప్రజలకు ఆహ్లాదం కలిగేలా నగర వనాలను ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో వీటిని నెలకొల్పేందుకు సిద్ధమవుతోంది.

జూన్ 8న ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రాచీన శివకేశవ ఆలయ ఆవరణలోని పురాతన భీమేశ్వరాలయం నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠ జూన్ 8న నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు ఏడిద శ్రీనివాస శర్మ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరుకోవడంతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు దాత జి. గురునాథ గుప్త, వారి కుటుంబ సభ్యులు రామకృష్ణ, కృష్ణశాస్త్రి ముందుకు వచ్చారన్నారు. ఈ మేరకు జూన్ 8న ధ్వజ స్తంభం ప్రతిష్ఠకు ముహూర్తం నిర్ణయించామని తెలిపారు. ఆయనతో పాటు ఆలయ ట్రస్టీ ఆర్. శింగరాచార్యులు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనరు ఎం. షణ్ముఖరావు, పట్టణ పురోహితులు మాధవశాస్త్రి, భీమిలి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమణ ప్రసాద్, కిశోర్, కామేష్, నరసింగ్, అప్పారావు పాల్గొన్నారు.



పద్మనాభంలో శ్మశాన వాటికకు రోడ్డు వేయక ముందు పరిస్థితి (ఫైల్ ఫొటో)



శ్మశానవాటికకు సీసీ రోడ్డు వేసిన తరువాత

ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

పద్మనాభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులతో భారీ ఎత్తున సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన రహదారులు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో డ్రైనేజీలతో పాటు రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పద్మనాభం, రేవిడి, వెంకటాపురం, కొయ్యపేట, పాండ్రంగి తదితర గ్రామాల్లో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో రోడ్డుకు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు మంజూరు చేశారు. రేవిడిలో అన్నంపేట నుంచి కళ్లాలకు ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు ఈ నిధులతో మోక్షం కలిగింది. పద్మనాభంలో గోస్తనీ నది సమీపంలో శ్మశానవాటికకు వెళ్లడానికి, రైతులు పొలాలకు వెళ్లడానికి అవసరమైన రహదారి నిర్మాణానికి కూడా నిధులు మంజూరు కావడంతో పనులు పూర్తి చేశారు.



నాగభూషణరావు భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కోరాడ నాగభూషణరావు ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

సర్పంచ్‌గా పనిచేశారు.నాగభూషణం వేములవలస పంచాయతీ సర్పంచ్‌గా, మండల టీడీపీ అధ్యక్షుడిగా, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.అలాగే ఆయన భార్య అరుణజ్యోతి సర్పంచ్‌గా గెలుపొందారు. కుమారుడు నవీన్ జ్ఞానేశ్వర్ ప్రస్తుతం వేములవలస ఉప సర్పంచ్‌గా ఉన్నారు. నాగభూషణం 30 ఏళ్ల పాటు ప్రజా సేవలో ఉన్నారు.సుమారు రెండేళ్ల క్రితం టీడీపీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అప్పటినుంచి బయటకు రాకుండా ఇంటికే పరిమితమయ్యారు. ఆరోగ్యం బాగుండకపోవడంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట ఆరిలోవలో గల ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం ఆయన ఆత్మహత్య చేసుకున్నారని తెలిసి భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల వాసులు దిగ్ర్భాంతికి గురయ్యారు. అశేష జనవాహిని మధ్య గురువారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.నాగభూషణరావు భౌతికకాయానికి ఎమ్మెల్యే గంటా పూలమాల వేసి, నివాళి అర్పించారు.

భీమునిపట్నం : భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోరాడ నాగభూషణరావు మృతి ప్రజ లకు తీరని లోటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. నాగభూషణరావు ప్రజా సేవకుడిగా ఎంతో మంచి పేరు పొందారన్నారు. కష్టంలో ఉన్న వారు ఆయన ఇంటి తలుపు తడితే తోచిన సహాయం చేసేవారని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా ఎంతో హుందాగా రాజకీయం చేసేవారన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా తోబుట్టువుల దినోత్సవం

తగరపువలస, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్ట పాఠశాలలో గురువారం తోబుట్టువుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు మాట్లాడుతూ అన్నాచెల్లులు, అక్కా తమ్ముళ్ల అనుబంధం గురించి వివరించారు. అక్క అంటే అనురాగం, అన్న అంటే ఆప్యాయత ఉండాలని చెప్పారు.

జీరుపేటలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు



అమ్మవారికి ఘటాలను తీసుకువెళుతున్న మహిళలు

తగరపువలస, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని జీరుపేటలో గురువారం నుంచి ఎలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహిళలంతా ఉదయం అమ్మవారికి ఘటాలను తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పసుపు దంచే కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

చిప్పాడ హెల్త్ సబ్ సెంటర్‌కు దివీస్ సాయం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి దివీస్ కంపెనీ రూ. 90 వేల విలువైన వస్తువులను సమకూర్చింది. గురువారం వాటిని కంపెనీ ప్రతినిధులు ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అందజేశారు. మందులను భద్రపరిచే బీరువా, రోగులకు మంచం, మూడు కుర్చీలు అందించారు. అలాగే ఆరోగ్య కేంద్రం ముందు భాగంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ 2. 30 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో తాళ్లవలస ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి. మల్లికార్జున శోభారాణి, చిప్పాడ సర్పంచ్ వెంపాడ రమావతి, ఎంపీటీసీ సభ్యుడు శివాజీ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అప్పారావు, వార్డు సభ్యులు, దివీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఒకేషనల్ కోర్సు

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెంలో వున్న కేజీబీ వీలో ఈఏడాది నుంచి సాధారణ సబ్జెక్టులతో పాటు ఒకేషనల్ కోర్సు (ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్) కూడా ప్రవేశపెట్టినట్టు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. గురువారం ఆమె ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థినులను కృష్ణాకాలనీలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి, సబ్‌స్టేషన్ పనిచేసే విధానంపై వివరించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఆనందపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీఓ ఎం. శ్రీదేవి అన్నారు. పోషకాహార పక్షోత్స వాల్లో భాగంగా ఆనందపురం పీహెచ్‌సీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున నాలుగు గంటలకు సుప్రభా తసేవ, ప్రభాతారాధనలు, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణ ఉంటాయి.ఉదయం 6.30 నుంచి 11.30 వరకు భక్తులకు దర్శనాలు,మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 వరకు రాజభోగం మహా నివేదన, సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై స్వామివారి తిరువీధి, రాత్రి 7 గంటలకు రాత్రి ఆరాధన, నివేదన జరగనున్నాయి.

పారిశుధ్యం లోపంపై ఎమ్మెల్యే గంటా ఆగ్రహం

అధికారులతో కలిసి 8వ వార్డులో పర్యటన



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎండాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌లో పారిశుధ్యం లోపంపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలానే మహిళలు తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని చెప్పడంతో ఆ విభాగం అధికారులపై కూడా మండిపడ్డారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలిసి వార్డులోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. తొలుత ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లల ఎండాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు పాఠశాలల్లో అడ్మిషన్ల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని ఉపాధ్యాయులు చెప్పగా అధికారులతో మాట్లాడి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గొల్లల ఎండాడ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న తుఫాన్ షెల్టర్ భవనాన్ని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎండాడలో రైతు బజారు ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. స్థల ఎంపిక పూర్తయిన వెంటనే రైతు బజారును అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్, లొడగల రామ్మోహన్, చెట్టుపల్లి సన్యాసిరావు, ఒమ్మి బాబూరావు, అక్కరబోయన రాంబాబు, పరమేశ్వరరావు, దొరబాబు, సారిపల్లి శ్రీను, మంగాదేవి పాల్గొన్నారు.

మానం ఆంజనేయనగర్‌లో అధికారుల పర్యటన



కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులోని మానంఆంజనేయనగర్‌లో వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం పర్యటించారు.కాలనీలో కాలువలు, రహదారులను పరిశీలించారు.ఈడబ్ల్యూఎస్ వుడా లేఅవుట్ ప్రకారం సర్వే నంబరు 126/4లో చూపించిన రహదారులు, కాలువలను ఒక వ్యక్తి మూసివేయడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని కాలనీ సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేశ్ వీఎంఆర్‌డీఏ గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ కార్యదర్శి, వీఎంఆర్‌డీఏ ప్రణాళికా కార్యదర్శి కాలనీలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు నివేదించి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా వుడా లేఅవుట్ ప్రకారం రోడ్లు, కాలువలు నిర్మించి కాలనీవాసులకు న్యాయం చేయాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ సంఘం నాయకులు ప్రతాప్‌రాజు,సీహెచ్ నాయుడు, జేడీ నాయుడు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చి

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చి సూచించారు. గురువారం ఆయన రఘు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో మాట్లాడారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే డబ్బులు లేనప్పుడు నేరం చేయాలనిపిస్తుందని చెప్పారు. సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు సుజాత, అప్పలరాజు, సీఐ తిరుమలరావు పాల్గొన్నారు.

విజయరాంపురం కాలనీలో తాగునీటి ఎద్దడి



పనిచేయని బోరు

పద్మనాభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాందేవపురం పంచాయతీ విజయరాంపురం ఎన్టీఆర్ కాలనీ లేఅవుట్‌లో మోటారు పాడవ్వడంతో ప్రజలకు వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయ బావులపై ఆధారపడుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నిస్తేజంగా అగ్నిమాపక కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

సంభవించినట్టయితే అందులో చిక్కుకున్న వారిని రక్షించడం, మంటలను అదుపుచేయడం కోసం హైడ్రాలిక్ బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనం ఒకటి ఉంది. అలాగే భవనాలు కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు వీలుగా ఐరన్, కాంక్రీట్ కటింగ్ చేసే రెస్క్యూ టెండర్ వాహనం ఒకటి సూర్యాబాగ్‌లోని ఫైర్ స్టేషన్‌లో ఉంది.

గాజువాకలోని ఆటోనగర్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో అక్కడ తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అక్కడి నుంచి ప్రమాదం జరిగిందని సమాచారం అందితే పెదగంట్యాడ లేదా మర్రిపాలెం నుంచి అగ్నిమాపక శకటం వెళ్లాలంటే అరగంటకు పైగా సమయం పడుతుంది. ఆలోగా మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించేస్తాయి. అందుకే ఆటోనగర్‌లో ఒక అద్దె భవనంలో టెంపరరీ ఫైర్ స్టేషన్‌ను అందుబాటులో ఉంచారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలకు సంబంధించి 484 ఫోన్ కాల్స్ ఫైర్ స్టేషన్లకు అందాయి. వీటిలో 90 శాతం ప్రమాదాలు పెద్దగా ఆస్తినష్టం లేనివి కాగా 45 ప్రమాదాలు మాత్రం ఆస్తినష్టం కలిగించాయి. మరో రెండు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

సమస్యలతో సతమతం

ఫైర్ స్టేషన్లన్నీ సమస్యలతో సతమతమవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 115 మంది సిబ్బంది పనిచేస్తుండగా, ఉద్యోగ విరమణల కారణంగా ఖాళీ అయిన 60 పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. అలాగే వాహనాల నిర్వహణకు ప్రభుత్వం సరిగా నిధులు ఇవ్వకపోవడంతో పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఎన్‌జీవోల సహాయంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫైర్ స్టేషన్‌లో శకటాలను నీటితో నింపే సదుపాయం లేకపోవడంతో సమీపంలోని జీవీఎంసీ వాటర్ పంప్‌హౌస్‌లు, ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలోని చెరువులు, బావుల నుంచి మోటార్లతో ట్యాంకులు నింపుకోవాల్సి వస్తోంది. భవనాలు కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీలుగా సిమెంట్ కాంక్రీట్, ఐరన్ కటింగ్ చేసేందుకు కేటాయించిన రెస్క్యూ శకటం కాలం చెల్లినది కావడంతో మరమ్మతులకు గురైంది. రిపేరు చేయించడానికి నిధుల్లేకపోవడంతో ఆ వాహనం చాలాకాలంగా మూలనపడి ఉండిపోయింది. ఇవికాకుండా సందుల్లో జరిగే అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు, ప్రముఖులు నగర పర్యటనకు వచ్చినప్పుడు కాన్వాయ్‌లో ఉంచడానికి, ఉత్సవాలు, జాతరలు జరిగినపుడు ప్రమాదం జరిగితే సకాలంలో ఆర్పేందుకు అవసరమైన మిస్ట్ జీపులు దశాబ్దం కిందటివి కావడంతో వాటి సామర్థ్యం తగ్గిపోయింది.

ఉన్న సిబ్బందితోనే సమర్థంగా విధులు

రేణుకయ్య, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి.

జిల్లాకు కొత్తగా మూడు అగ్నిమాపక కేంద్రాలు మంజూరయ్యాయి. ఐటీ అభివృద్ధి నేపథ్యంలో ఎండాడలో ఒకటి, మధురవాడ వైపు నగరం విస్తరిస్తుండడంతో కాపులుప్పాడలో ఒకటి, సింహాచలం క్షేత్రానికి భక్తులు రద్దీ పెరుగుతుండడం, తరచూ ఉత్సవాల నిర్వహణ జరుగుతుండడంతో సింహపురి లేఅవుట్‌లో ఒకటి ఏర్పాటుచేయబోతున్నాం. వాటికి నిధులు మంజూరు, టెండర్ ప్రక్రియ కూడా పూర్తవ్వడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఉన్న సిబ్బంది, వనరులతోనే సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నాం. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే 101 నంబర్‌కు మాత్రమే డయల్ చేయాలి. దీనివల్ల సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరుతుంది. కాబట్టి సకాలంలో అగ్నిమాపక శకటం అక్కడకు చేరుకుని మంటలను ఆర్పడానికి అవకాశం ఉంటుంది.

తహశీల్దార్ల కొరత

... 5వ పేజీ తరువాయి

అక్కడ కలెక్టర్ రిలీవ్ చేయలేదు.విశాఖ వచ్చేందుకు అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి పలువురు సీనియర్లు ఆసక్తి చూపుతున్నా.. అక్కడి కలెక్టర్లు ముందుకు రావడం లేదు.

జిల్లాల విభజనలో అనుభవం ఉన్న సీనియర్లు మిగిలిన రెండు జిల్లాలకు వెళ్లిపోయారని, ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రెవెన్యూ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇంకా డీటీల నుంచి తహసీల్దార్లుగా పదోన్నతుల కోసం ఉమ్మడి జిల్లాలో 32 మంది ఎదురుచూస్తున్నారు. వీరిలో ప్రో డీటీలు 16 మంది, పదోన్నతిపై వచ్చినవారు మరో 16 మంది ఉన్నారు. పదోన్నతుల వివాదం కోర్టులో ఉండడంతో చాలాకాలంగా ప్రతిష్టంభన కొనసాగుతుంది. ప్రోడీటీలు, పదోన్నతి డీటీల మధ్య రాజీ కుదిరి కేసు ఉపసంహరించుకునేంత వరకు తహశీల్దార్ల పదోన్నతులు ఇచ్చే అవకాశం లేదని అంటున్నారు. ఈ వివాదం కొన్నాళ్లు కొనసాగితే జిల్లాలో తహశీల్దార్ల కొరత మరింత పెరుగుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

నిర్మించడం ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. భూసేకరణ త్వరగా పూర్తిచేసి, మిగిలిన పనులు కూడా చేపట్టడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. అలాగే ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ కార్యాలయాన్ని అమరావతి నుంచి విశాఖపట్నం తీసుకువచ్చి, డాబాగార్డెన్స్‌లోని ఎల్ఐసీ భవనంలో ఏర్పాటు చేశారని, దానికి అద్దె రూపంలో ఎక్కువ వ్యయం అవుతున్నందున, తక్కువ అద్దెకు వచ్చే సిరిపురం వీఎంఆర్‌డీఏ భవనంలోకి మార్చాలని సూచించారు. దీనికి ఏర్పాట్లు చేశామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ సీఎంకు చెప్పారు.

అలరించిన కూచిపూడి నృత్యం

సింహాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం కళా వేదికలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యాలు భక్తులకు నయనానందం కలిగించాయి. నగరానికి చెందిన ఉషోదయా కూచిపూడి కళా సంక్షేమ సంఘం నిర్వాహకురాలు పి అర్చన ఉషశ్రీ దర్శకత్వంలో విద్యార్థులు అన్నమయ్య కీర్తనలకు నృత్యాలు ప్రదర్శించారు. అలాగే నాదనీరాజనం సంస్థ ప్రతినిధి సాయికుమారి, అన్నమ్మయ్య జానపద కళా క్షేత్రానికి చెందిన వై. అప్పారావు ప్రదర్శనలు కూడా భక్తులను అల రించాయి. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు కళాకారులను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులను సత్కరిస్తున్న అధికారులు

పద్మనాభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామంలో వ్యవసాయాధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖరీఫ్ ముందు నవ ధాన్యాలను సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. పంటకు చీడ, పీడలు ఆశించవని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ ఎర్రిబాబు, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'యాప్' కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

హాజరైతే 15 నుంచి 20 మందిని మాత్రమే కౌంట్ చేస్తోందని, దీనివల్ల పిల్లలకు పూర్తి స్థాయిలో వండి వడ్డించలేని పరిస్థితి ఎదురవుతోందంటున్నారు. అంతేకాకుండా సిబ్బంది హాజరు కూడా ఇదే యాప్‌లో నమోదు చేయాలని, సమయానికి యాప్ ఓపెన్ కాకపోవడంతో కేంద్రానికి ఆలస్యంగా వచ్చినట్టు నమోదవుతోందని వాపోతున్నారు.

ఖర్చుల వివరాలూ యాప్‌లోనే..

కొద్దిరోజుల కిందటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖర్చులకు సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేసే అవకాశం ఉండేది. తాజాగా పిల్లలకు వండి వడ్డించేందుకు అయ్యే ఖర్చుకు సంబంధించిన ప్రతి రూపాయిని యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక సమస్యలతో వివరాలు అప్‌లోడ్ కాకపోతే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పిల్లలు గుండు చేయించుకుని ఉన్నా, ఫొటో తీసే సమయంలో కెమెరావైపు చూడకపోయినా వారి హాజరును లెక్కించడం లేదని, దీంతో రోజువారీ ఖర్చులపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో పిల్లాడికి రోజుకు 75 గ్రాముల బియ్యం ఇవ్వాలి. పది మంది పిల్లలుంటే 750 గ్రాముల బియ్యం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ, కొంతమంది పిల్లల హాజరు తీసుకోకపోవడంతో సమస్యలు వస్తున్నాయంటున్నారు. నెల ప్రారంభంలో ఓపెనింగ్ బ్యాలెన్స్ (గత నెలలో మిగిలిన గుడ్లు, ఇతర సరకులు) వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే, ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో అప్‌లోడ్ చేసిన సరకుల వివరాలకు రెట్టింపు చూపిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ చిక్కులన్నీ తమ పనితీరుపై ప్రభావం చూపిస్తున్నాయని, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు.

అప్‌డేట్ చేసిన యాప్‌తో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని, వెంటనే పరిష్కార మార్గాలను సూచించాలని వారంతా కోరుతున్నారు.

నూకాలమ్మ ఆలయ నూతన కార్యవర్గం

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు కె. నగరపాలెంలో నూకాలమ్మ ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. ఆలయ ఆవరణలో జరిగిన ఈ ఎన్నికలో ఛైర్మన్‌గా పోతిన అప్పలరాజు, సభ్యులుగా వెంకటేష్, నాగోతి అచ్చారావు, ఎరుసు అప్పలకొండ, పాలనాయుడు, ఎల్లాజి, నరవ బసవయ్య, కోడిబోయిన వరహాలు, దేవర వెంకటరావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కె. నగరపాలెం, సోమన్నపాలెం, రెడ్డిలపాలెం, గొల్లలపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహగిరిపై అగ్నిప్రమాదం

సింహాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో టీవి టవర్ సమీప తోటల్లో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన రైతులు దేవస్థానం అధికారులకు సమాచారమిచ్చారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు సారథ్యంలో అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కాలువల్లో పూడికతీత

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మూడో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు గురువారం కాలువల్లో పూడికలు తొలగించారు. పట్టణంలో మురికివాడలుగా వున్న ఎగువపేట, తోట వీధి, గొల్లవీధి, అప్పికొండ వీధుల్లో సుమారు 30 మంది కార్మికులు సామూహికంగా ఈ పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ టీఎం నాయుడు, సూపర్‌వైజర్లు రామశర్మ, రేగాని రవి ఈ పనులను పర్యవేక్షించారు.

ఉత్సవంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి) : అప్పన్న స్వామి వార్షిక ఉత్సవాల్లో స్వచ్ఛంద సంస్థల సేవలు కీలకమని దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీర్ డిజి శ్రీనివాసరాజు అన్నారు.ఈనెల 30న జరగనున్న స్వామి వారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఎస్‌డీసీ గీతాంజలి, ఈఈ మాట్లాడుతూ సేవకులకు అవసరమన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాడు వీధిలో ఉన్న బీజేపీ కార్యాలయంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనరు రామానాయుడు మాట్లాడుతూ పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతున్న విషయాలు, ఎన్నికల్లో సాధించిన విజయాలు గురించి వివరించారు.

ఖాకీ వసూల్‌పై సీపీ సీరియస్

... 5వ పేజీ తరువాయి

ఒప్పందం పై కథనం రావడంతో వసూళ్ల బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుళ్లు, సీఐలు అప్రమత్త మయ్యారు. మద్యం వ్యాపారులను కలిసి ఎవరైనా వచ్చి నెలవారీ వసూళ్ల గురించి అడిగితే ఇవ్వడం లేదని చెప్పాలని ఆదేశించారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ అంశంపై ఇంటెలిజెన్స్‌తో పాటు ఏసీబీ అధికారులు ఆరా తీసినట్టు చెబుతున్నారు. ఆయా విభాగాల సిబ్బంది మద్యం దుకాణాల వద్దకు వచ్చి యజమాని వివరాలు, ఫోన్ నంబరు తీసుకుంటున్నారని, ఫోన్‌చేసి పోలీసులకు నెలవారీ ఎంత ఇస్తున్నారు? ఎవరు వచ్చి డబ్బు తీసుకెళుతున్నారు? వంటి వివరాలను అడుగుతున్నారని చెబుతున్నారు. అయితే మామూళ్లు ఇచ్చినట్టు అంగీకరిస్తే, వ్యాపారం కుదేలైపోతుందనే కారణంతో ఇవ్వడం లేదని చెబుతున్నామని కొంతమంది వ్యాపారులే పేర్కొనడం విశేషం. కాగా నేరుగా అడిగితే మామూళ్లు ఇస్తున్నామని ఎవరూ అంగీకరించరని, ముక్కుబడిగా మమ అనిపించేందుకే ప్రశ్నిస్తున్నారని, ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారని అభిప్రాయపడుతున్నారు. తమదైన శైలిలో నిఘా పెడితే నెలవారీ మామూళ్లు ఎవరు వసూలు చేస్తున్నారో బయటపడుతుందని చెబుతున్నారు.

స్థలాల కబ్జాలు.. వెలుస్తున్న బడ్డీలు!

- అద్దెలకివ్వడం.. విక్రయించడం చేస్తున్న అక్రమార్కులు
- అధికారులు అడ్డుకున్నా రాజకీయ పలుకుబడితో యథేచ్ఛగా దందా..



వడ్లపూడి-కణితి మార్గంలో అనధికార షాపులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డులో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ముందుగా ఖాళీ స్థలాలు ఎక్కడున్నాయో అన్వేషించడం.. సదరు స్థలాల్లో, మురుగు కాలువలపై బడ్డీలను ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ అధికారులు ఎవరైనా తొలగించడానికి యత్నిస్తే తమకున్న రాజకీయ పలుకుబడితో అడ్డుకుంటున్నారు. ఆ తరువాత యథేచ్ఛగా బడ్డీలను అద్దెకిస్తూ లక్షల రూపాయలను ఆర్జిస్తున్నారు. ఒక్కోసారి ఆ బడ్డీలను అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కడ మురుగు కాలువలు, ఖాళీ స్థలం కనిపించి తెల్లారేసరికి బడ్డీలు, షెడ్లు వంటివి వెలుస్తున్నాయి. వడ్లపూడి, కణితి, ముస్తఫా జంక్షన్, తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు అధికమయ్యాయి. కాగా ఆక్రమణల ఫలితంగా రహదారులు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాజకీయ నేతల ఒత్తిళ్ల మేరకు అధికారులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అక్రమార్కులు రహదారుల పక్కనున్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చిన్న బడ్డీలను ఏర్పాటు చేసి జీవీఎంసీకి పైసా కూడా చెల్లించకుండా అద్దెలకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జోరుగా వ్యాపారం జరిగే కూడళ్లలో ఒక్కో షాపునకు నెలకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు అద్దెల రూపేణా వసూలు చేస్తున్నారు. వీటిపై జోనల్ అధికారులకు ఫిర్యాదులు వస్తున్నా తూతూ మంత్రపు చర్యలు చేపడుతున్నారే తప్పా శాశ్వత చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కణితి పీహెచ్‌సీ వద్ద ఆక్రమణలను తొలగించాలని వైద్య సిబ్బంది జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. ఈ ఆక్రమణలు ఆస్పత్రికి వచ్చే వాహనాల పార్కింగ్‌కు అవరోధంగా మారాయని సిబ్బంది పేర్కొంటున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కాలుతున్న కొబ్బరిచెట్టు

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం

పలుచోట్ల భారీ వర్షం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి 88వ వార్డు పరిధి డాక్‌యార్డు కాలనీలోని ఓ కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో కొబ్బరి చెట్టు ఒక్కసారిగా దగ్ధమైంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి నీరు పారింది. మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఊరట లభించింది. గత కొద్ది రోజులుగా మండుతున్న ఎండతో విలవిల్లాడుతున్న ప్రజానీకం ఈ వర్షంతో సేద తీరారు. కాగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

పెదగంట్యాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే, భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే విగ్రహాలను శుక్రవారం స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించనున్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఈ విగ్రహాలను ఆవిష్కరిస్తున్నామని, కార్యక్రమంలో ఉక్కు అధికారులు, కార్మిక నాయకులు, ఉద్యోగులు పాల్గొనవలసిందిగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీముసిరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు.

వ్యాసరచన పోటీలు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాల్లో భాగంగా షీలానగర్‌లోని ఆలయంలో మణికంఠ జ్యోతి భక్తసేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో అక్కిరెడ్డిపాలెం, మింది హైస్కూల్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీలను సంఘ నాయకులు చరపాక నాగార్జున, నంబారు రాజు, శ్రీనివాసరావు, చినఅప్పలస్వామి పర్యవేక్షించారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 44, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 14, క్యారెట్ 32 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 30, అల్లం 48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 52, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 40, కంద 48, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



అమ్మవారికి జలాభిషేకాలు చేసేందుకు బారులుతీరిన భక్తులు

వైభవంగా బొర్రమాంబ పుట్టబంగారు ఉత్సవం

అమ్మవారి జలాభిషేకానికి పోటెత్తిన భక్తులు

అగనంపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ప్రజల ఇలవేల్పు బొర్రమాంబ పుట్టబంగారు ఉత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజాము 3 గంటల నుంచే అమ్మవారిని దర్శించి జలాభిషేకం చేసేందుకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం వరకు జలాభిషేకాలు కొనసాగడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సాయంత్రం అమ్మవారిని మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ పాత అగనంపూడిలోకి గ్రామ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న తొలేళ్లు, 15న అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్ తెలిపారు.

హోమియో వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి హోమియో వైద్యం ఎంతో దోహదపడుతుందని ప్రభుత్వ హోమియో వైద్యాధికారిణి డాక్టర్ రాపేటి శ్రీదేవి అన్నారు. మింది ప్రభుత్వ హోమియో వైద్యశాలలో గురువారం నిర్వహించిన ప్రపంచ హోమియోపతి దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై దివంగత డాక్టర్ సామ్యూల్ హానిమాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హోమియో వైద్యం ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని కోరారు.

కుక్కల బారినుంచి కాపాడండి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): షీలానగర్‌లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి గురువారం షీలానగర్ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో కుక్కల బెడదతో పాటు పలువురు వ్యాపారులు, పలు కార్యక్రమాలకు వినియోగిస్తున్న మైక్ సౌండ్ల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని జడ్సీకి వివరించారు. ఆయనను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు వై.సత్యవతి, పీఎస్ఎన్ రాజు, ఎస్.సత్యారావు, జి.మణి, ఎం.రాంబాబు, తదితరులు ఉన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

అగనంపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిచెట్టు ఎక్కుతూ కాలుజారి కిందపడడంతో వెన్నుపూస విరిగిపోయి మంచానికే పరిమితమైన డి.శ్రీను అనే వ్యక్తికి సర్వహిత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అండగా నిలిచారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన బాధితుడిని కలిసి రూ.పది వేలతో పాటు నిత్యావసర సరకులను అందజేశారు.

విద్యాలయాల్లో అడ్మిషన్లు చేపట్టేలా చూడాలని ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న లెనిన్‌బాబు, చిరంజీవి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల విశాఖ విమల విద్యాలయం, కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ శ్రీభరత్‌కు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు వినతిపత్రం అందజేశారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను సమస్యలను వివ రించారు. కేంద్రీక విద్యాలయంలో 1, 11వ తరగతులకు, వీవీవీలో ఒకటో తరగతికి ఈ ఏడాది అడ్మిషన్లను నిలిపివేయడంతో స్థానికంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులుపు పడుతున్నారన్నారు. ఎంపీని కలిసిన వారిలో కేవీ పేరెంట్స్ కమిటీ ప్రతినిధి చిరంజీవి ఉన్నారు.

రహదారి విస్తరణలో తేడాలపై స్థానికుల అభ్యంతరం

- నిబంధనలకు వ్యతిరేకమని ఆవేదన
- అధికారులు న్యాయం చేయాలని వినతి



పెందుర్తిలో రహదారి విస్తరణ పనులు



సామాజిక భవనం లోపలినుంచి డ్రైనేజీ నిర్మాణం

పెందుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అలైన్‌మెంట్‌కు విరుద్ధంగా పెందుర్తిలో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రహదారి మధ్యస్థం గుర్తించకుండా కొంతమందికి లబ్ధి చేకూర్చేలా విస్తరణలో వ్యత్యాసం చూపిస్తున్నారని, ఈ నేపథ్యంలో నివాసితుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. పెందుర్తి రాజుచెరువు నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం కోసం రహదారికి ఇరువైపులా సుమారు 90 అడుగులు విస్తరిస్తున్నారు. దాదాపు 45 రోజులుగా జరుగుతున్న ఈ పనులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విస్తరణలో సెంటర్ పాయింట్ నుంచి కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. హెచ్చుతగ్గులతో పనులు చేపట్టడంతో విలువైన ఆస్తులకు నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. పేదల ఆస్తులపై ప్రతాపం చూపుతూ పలుకుబడి ఉన్న వారిని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో రాతిచెరువు భూలోకమ్మ ఆలయ సమీపంలో సామాజిక భవనంలోనికి చొచ్చుకునిపోయి డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంపై మండిపడుతున్నారు. ఇళ్లు, చిరు వ్యాపారులు తమ ఆస్తులను నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. అంతేకాకుండా టీడీఆర్ ఇవ్వకుండానే పనులు చేపడుతున్నారని మరి కొంతమంది ఆరోపిస్తున్నారు.

నిబంధనల మేరకే విస్తరణ

రహదారి సెంటర్ పాయింట్ మార్కింగ్ చేసుకుని పెందుర్తిలో రహదారి విస్తరణ పనులు చేపట్టాం. రోడ్డుకు రెండు వైపులా మార్జిన్ సరిపోయేలా 90 అడుగుల మేర విస్తరిస్తున్నాం. కొన్నిచోట్ల నిర్మాణాలను తొలగించాల్సి వస్తోంది. అభ్యంతరాలు వున్న చోట సమస్యను పరిష్కరిస్తున్నాం.

- శివ, ఏఈ, పబ్లిక్స్ వర్క్స్

షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్‌లో అధిక పెన్షన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధి నూకరాజు

మల్కాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ మాదిరిగానే మిగిలిన ప్రభుత్వ సంస్థల విశ్రాంత ఉద్యోగులకూ అధిక పెన్షన్ ఇవ్వాలని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన పెన్షనర్ల సమావేశంలో మాట్లాడారు. అధిక పెన్షన్ మంజూరులో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీలకు వర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెన్షన్ పెంపుదల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్రం కనీసం స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. అనంతరం పీఎఫ్ కమిషనర్‌తో చర్చలు జరుపుతామని వివరించారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన రెండు శాతం బకాయిలపై ఎంపీ భరత్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు బారులుతీరిన జనం



సౌకర్యం కేంద్రం వద్ద పన్ను చెల్లింపునకు వేచి ఉన్న ప్రజలు

వేపగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో ఇంటి పన్నులు, నీటి పన్ను చెల్లించేందుకు ఉదయం నుంచి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈనెల 30లోగా ముందస్తు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇవ్వడంతో అధికసంఖ్యలో జనం క్యూ కట్టారు. సౌకర్యం కేంద్రంలో రెండు కౌంటర్లున్నప్పటికీ చెల్లింపుదారులు భారీగా రావడంతో మరో మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 30వరకు అదనపు కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8వరకు పనిచేస్తాయని జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బాజీజంక్షన్, రెడ్డి వీధి, సుసర్ల కాలనీ, జయప్రకాశ్‌నగర్, ఎస్సీకాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వేస్టేషన్ ఏరియా, నాయుడు క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: ఎమ్మెల్యే పంచకర్ల



శిబిరంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, తదితరులు

వేపగుంట ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం దోహదపడుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక బీసీకాలనీలో గంట్ల పెంటారావు(జీపీఆర్) అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రమం తప్పకుండా రక్తదానం చేయడం గొప్పవిషయమన్నారు. శిబిరం నిర్వహించిన గంట్ల దివాకర్‌ను అభినందించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న దివాకర్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు సుమారు 70 మంది నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, మౌర్యశింహ, సరిపల్లి సర్పంచ్ జి.రామకృష్ణ, దాట్ల మధు, నేతలు బండారు అప్పలనాయుడు, పిన్నింటి పార్వతి, అప్పారావు, చుక్క కృష్ణ, సాలాపు రమణ పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి పనులు చేపట్టాలని 'పల్లా'కు వినతి

గాజువాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 74వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ వార్డు ఇన్‌చార్జి వియ్యపు కొండబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వార్డులో రోడ్లకు మరమ్మతులు చేయాలని, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్‌లు నిర్మించాలని విన్నవించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గాజువాకలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 74వ వార్డును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దువ్వి శ్రీను, మొల్లి చిన్నోడు, వెంకినాయుడు, తాతారావు, తాతాలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవనోపాధిని దెబ్బతీయవద్దు

స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్)ను కోరిన కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఏ ఒక్కరిని విధుల నుంచి తొలగించి వారి జీవనోపాధిని దెబ్బతీయవద్దని జీఎం (హెచ్‌ఆర్) ఎం.మధుసూధనరావును గురువారం కార్మిక సంఘ నాయకులు కోరారు. జీఎంతో కార్మిక సంఘ నాయకులు సమావేశమై పలు సమస్యలను వివరించారు. ఇటీవల కాలంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, భవిష్యత్తులో ఎవరిని తొలగించరాదని, తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వేడుకున్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. సమావేశంలో అధికారులు ఎన్.భాను, శంకర్, కార్మిక నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వంశీ, కేఎం శ్రీనివాసరావు, రమణ, సొంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై ప్రచారం

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈ నెల 16 నుంచి చేపట్టనున్న కార్మిక నిరవధిక సమ్మెపై అఖిలపక్ష నాయకులు ప్లాంటులో విస్తృత ప్రచారం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో జీతాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు లేకుండా చూడాలని, పూర్తయిన కాంట్రాక్టర్ల టెండర్ల ప్రక్రియను పునరుద్ధరించి కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలంటూ ఆయా విభాగాల్లో ప్రచారం సాగించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరాజు, ఆలం, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వద్దు

ఉక్కు ఉద్యోగులంతా గతంలో ఎన్నడూ లేని విధంగా జీతాల కోసం ఎదురు చూసే దుస్థితి నెలకొందని, కార్మికుల జీతాల చెల్లింపులో యాజమాన్య నిర్లక్ష్యం తగదని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. నాయకులు బి.వరహాలబాబు, డి.సాహు, శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ దరఖాస్తుకు గడువు పెంచాలి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): కేంద్ర ప్రభుత్వ హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో నెల రోజుల పాటు గడువు పెంచాలని కోరుతూ కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ గురువారం లేఖ లేశారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంకా చాలామంది దరఖాస్తు చేసుకోలేదని, అందువల్ల నెల రోజల గడువు పెంచితే స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత: సీఐ



నర్సింగ్ విద్యార్థినుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలకు భద్రత లభిస్తుందని సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. స్థానిక అమృత నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు గురువారం శక్తి యాప్‌పై ఆయన అవగాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర సమయంలో వినియోగించుకోవాలన్నారు. అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడుల నుంచి కాపాడుకునేందుకు యాప్ రక్షణ కవచం అన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న మహిళలంతా శక్తి యాప్ డైన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులతో కలిసి అవగాహన కల్పిస్తున్న సీఐ

పెందుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణం సాగేందుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ నరసింగరాజు తెలిపారు. పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం పెందుర్తిలో వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారి క్రాసింగ్ జీబ్రా లైనింగ్, ట్రాఫిక్ నిబంధనలు తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి ట్రాఫిక్ భద్రతపై నినాదాలు చేశారు.

చురుగ్గా కాలువ నిర్మాణ పనులు



ఎన్ఏడీ సర్వీసు రోడ్డును ఆనుకుని పనులు

ఎన్ఏడీ జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డును ఆనుకుని కాలువ వద్ద నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.15లక్షల తో కల్వర్టుకు అనుసంధానం చేసే ప్రధాన కాలువకు రక్షణగోడ పనులు చేపడుతున్నారు. అయితే కాలువలో చెత్త వేయకుండా ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిస్తే నీటితో పాటు చెత్త కాలువలోకి చేరుతుందని, దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువలోకి చెత్త చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానానికి జరిమానా: సీఐ

మల్కాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే జరిమానా విధిస్తామని మల్కాపురం సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రతిరోజూ కొంతమంది బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తూ పట్టుబడుతున్నారని, వారికి జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ చేస్తున్నామన్నారు. ప్రధానంగా మద్యం దుకాణాలు, బార్లు, హోటల్స్, పాన్‌షాప్‌ల వద్ద, నిఘా ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, వేంకటేశ్వర కాలనీ, ఎనభై అడుగుల రోడ్డు, తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఆలయపునర్నిర్మాణానికి నేడు శంకుస్థాపన

కంచరపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తిక్కవానిపాలెం గ్రామంలో 1932లో నిర్మించిన అతిపురాతన వేంకటేశ్వరాలయం శిథిలస్థితికి చేరడంతో ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో శిథిలమైన ఆలయాన్ని ఇటీవల తొలగించారు. ఆలయంలో విలువైన వస్తువులు, విగ్రహాలను పక్కనే గల అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో భద్రపరిచారు. ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి ఉమ్మడి వాసుదేవరావు, పట్టిమరాజు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రముఖ వేదపండితుడు రామాచారి, ఇతర పెద్దలు చేతుల మీదుగా జరుగుతుందన్నారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు వాసుదేవరావు విజ్ఞప్తి చేశారు.

వాహనదారులు భద్రత పాటించాలి

మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మునీషా

మురళీనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నగర రోడ్లపై ప్రయాణించేటపుడు వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించి అధికారులకు సహకరించడంతో పాటు కోర్టు ఆదేశాల్ని గౌరవించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మునీషా సూచించారు. బైక్‌పై వెళ్లే వారు, కార్లలో తిరిగేవారు కూడా తమ గమ్యస్థానాల్ని క్షేమంగా చేరే విధంగా నడుచుకోవాలన్నారు. విశాఖపట్నం ఆర్టీఏ కార్యాలయ పరిధిలో మాధవధారలోని ఆర్ అండ్ బీ జంక్షన్‌లో గురువారం వాహనాల తనిఖీ చేసి, వెహికల్ యజమానులకు అవగాహన కల్పించారు. వాహన రికార్డుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సహాయకులుగా వన్ టౌన్ ట్రాఫిక్ విభాగం నుంచి హాజరైన పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. కనీస నిబంధనల్ని పాటించని వారిపై చర్యలు తీసుకున్నారు. ఆర్టీఏ ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగంతో కలసి రోడ్డు భద్రతా నియమాల్ని పాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ మేరకు ఎంవిఐ మునీషా పేర్కొన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ సాగర్ కవచ్ మాక్‌డ్రిల్

» రెండు రోజుల పాటు నిర్వహించిన ఆర్పీఎఫ్ సిబ్బంది



ఆర్డీఎక్స్ ఎక్స్‌పోజీను గుర్తించిన ప్రదర్శనలో ఆర్పీఎఫ్ సీఐ, ఇతర సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే సింహాచలం రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ పోస్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన సాగర్ కవచ్ ఇంటెన్సివ్ భద్రత విన్యాసాల మాక్ డ్రిల్ గురువారం ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన సాగర్ కవచ్ ఇంటెన్సివ్ భద్రత విన్యాసాల మాక్ డ్రిల్‌లో అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి నిర్మూలించడం, భద్రతపై అప్రమత్తంగా వ్యవహరించడం వంటి అంశాలను మాక్ డ్రిల్ చేశారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఆర్పీఎఫ్ ఎస్ఐ పి.కె.రౌల్ నేతృత్వంలో సాగర్ కవచ్ ఆపరేషన్‌కు ప్రదర్శనకు సంబంధించి సింహాచలం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ఆర్డీఎక్స్ ఎక్స్‌పోజీతో ఉన్న ఇద్దరు రెడ్‌ఫోర్సు వ్యక్తులను గుర్తించి విజయవంతంగా పట్టుకోవడం, ఈ క్రమంలో సిబ్బంది సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు చూపిన చొరవ హైలెట్‌గా నిలిచింది. సాగర్ కవచ్ ఇంటెన్సివ్ భద్రత విన్యాసాల ప్రదర్శనలో ఆర్పీఎఫ్‌తో పాటు జీఆర్పీ, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారని ఆర్పీఎఫ్ అధికారి తెలిపారు.

'పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతో అభివృద్ధి చేయాలి'



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న శ్రీకాంత్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపి, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని ఏపీ మెడికల్ రిప్రజెంటివ్ నాయకుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయవద్దంటూ నిర్వహిస్తున్న దీక్షలు గురువారంతో 192వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించారు. 40 వేల మంది ఆరోగ్యాలను వ్యాపారం చేయాలని మోదీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమన్నారు. ఇటీవల పోర్టు స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌ను ప్రైవేటు వ్యక్తులు నిర్వహించడం వల్లే ఓ బాలుడు మృతి చెందాడని చెప్పారు. భవిష్యత్‌లో పోర్టు ఆస్పత్రిని కూడా ప్రైవేటు వారికి ఇస్తే ఎంతమంది మృతి చెందుతారో ఎవరికీ తెలియదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా ఆస్పత్రుల్లో ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు, కె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, జక్కన సత్యనారాయణ, నాయుడు, కేఎస్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసులపై జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు దారుణం

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సీతంపేట, ఏప్రిల్ 10, (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పోలీసులు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఘాతం కలిగించేలో భాగంగానే జగన్మోహన్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. గురువారం పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూర్తి యాదవ్ మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడే విధంగా జగన్ మాటలు ఉన్నాయని, రాష్ట్ర కీర్తిప్రతిష్ఠలు భంగం కలింగించేలా జగన్ మాట్లాడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి భాషను వాడడం ద్వారా మాజీ సీఎం జగన్ తన స్థాయిని దిగజార్చుకున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. జగన్‌కు ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియదని ఎద్దేవా చేశారు.

యూడైస్‌లో ముగ్గురు విద్యార్థులు పునర్ ప్రవేశం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో డైస్‌లో రీజాయినింగ్ అయిన 8,9 చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో సీతమ్మధార మండల ఎంఈవోలు రామారావు, బాలామణి, హెచ్ఎం బి. లక్ష్మీనరస తదితరులు పాల్గొన్నారు.

కంచి కామకోటి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు

12 నుంచి స్పాట్ అడ్మిషన్లు

» కంచి కామకోటి శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టీవీ రవిరాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కంచి కామకోటి పీఠాధీశ్వరులు శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ విద్యా సంస్థలలో 12, 13, 21 తేదీల్లో శంకరమఠంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు కంచి కామకోటి శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టీవీ రవిరాజు తెలిపారు. గురువారం శంకరమఠంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాలతోసంబంధం లేకుండా అన్ని వర్గాలకు నాణ్యమైన విద్య అందిస్తున్న విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లను అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆయా విద్యా సంస్థల్లో ఆరో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. హాస్టల్ వసతి కూడా ఉందని, విద్యానంతరం ప్లేస్‌మెంట్ సదుపాయం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు జేఈఈ, నీట్, సీఏ, ఫౌండేషన్, క్లాట్ ప్రత్యేక పరీక్షలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. సనాతన ధర్మంలో పొందుపరచబడిన సంప్రదాయ విలువలతో కూడిన శ్రేష్ఠమైన విద్యను విద్యార్థులకు అందించడమే కంచి కామకోటి పీఠాధీశ్వరులు శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి లక్ష్యమని వెల్లడించారు. చంద్రశేఖర సరస్వతి విశ్వ మహా విద్యాలయం, సంప్రదాయపాఠశాల, శంకర సంస్కృత పాఠశాల, శంకరసరస్వతి పాఠశాల, శాస్త్ర సారణి పాఠశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, శంకర విజయేంద్ర సరస్వతి రామాయణ పాఠశాల, కంచి కామకోటి శంకర విద్యాలయం తదితర విద్యా సంస్థల్లో వివిధ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు లభిస్తాయన్నారు.

రైల్వే స్టేషన్‌లో పర్యటించిన రైల్వే బోర్డు అదనపు సభ్యుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే బోర్డు అడిషనల్ మెంబరు (రెవెన్యూ) డాక్టర్ నవల్ కె.శ్రీవాస్తవ గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లో పర్యటించి తనిఖీలు చేశారు.

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

నిర్మించడం ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. భూసేకరణ త్వరగా పూర్తిచేసి, మిగిలిన పనులు కూడా చేపట్టడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. అలాగే ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ కార్యాలయాన్ని అమరావతి నుంచి విశాఖపట్నం తీసుకువచ్చి, డాబాగార్డెన్స్‌లోని ఎల్ఐసీ భవనంలో ఏర్పాటు చేశారని, దానికి అద్దె రూపంలో ఎక్కువ వ్యయం అవుతున్నందున, తక్కువ అద్దెకు వచ్చే సిరిపురం వీఎంఆర్‌డీఏ భవనంలోకి మార్చాలని సూచించారు. దీనికి ఏర్పాట్లు చేశామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ సీఎంకు చెప్పారు.

ఖాకీ వసూల్‌పై సీపీ సీరియస్

... 5వ పేజీ తరువాయి

ఒప్పందం పై కథనం రావడంతో వసూళ్ల బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుళ్లు, సీఐలు అప్రమత్త మయ్యారు. మద్యం వ్యాపారులను కలిసి ఎవరైనా వచ్చి నెలవారీ వసూళ్ల గురించి అడిగితే ఇవ్వడం లేదని చెప్పాలని ఆదేశించారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ అంశంపై ఇంటెలిజెన్స్‌తో పాటు ఏసీబీ అధికారులు ఆరా తీసినట్టు చెబుతున్నారు. ఆయా విభాగాల సిబ్బంది మద్యం దుకాణాల వద్దకు వచ్చి యజమాని వివరాలు, ఫోన్ నంబరు తీసుకుంటున్నారని, ఫోన్‌చేసి పోలీసులకు నెలవారీ ఎంత ఇస్తున్నారు? ఎవరు వచ్చి డబ్బు తీసుకెళుతున్నారు? వంటి వివరాలను అడుగుతున్నారని చెబుతున్నారు. అయితే మామూళ్లు ఇచ్చినట్టు అంగీకరిస్తే, వ్యాపారం కుదేలైపోతుందనే కారణంతో ఇవ్వడం లేదని చెబుతున్నామని కొంతమంది వ్యాపారులే పేర్కొనడం విశేషం. కాగా నేరుగా అడిగితే మామూళ్లు ఇస్తున్నామని ఎవరూ అంగీకరించరని, మొక్కుబడిగా మమ అనిపించేందుకే ప్రశ్నిస్తున్నారని, ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారని అభిప్రాయపడుతున్నారు. తమదైన శైలిలో నిఘా పెడితే నెలవారీ మామూళ్లు ఎవరు వసూలు చేస్తున్నారో బయటపడుతుందని చెబుతున్నారు.

భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

సర్పంచ్‌గా పనిచేశారు. నాగభూషణం వేములవలస పంచాయతీ సర్పంచ్‌గా, మండల టీడీపీ అధ్యక్షుడిగా, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అలాగే ఆయన భార్య అరుణజ్యోతి సర్పంచ్‌గా గెలుపొందారు. కుమారుడు నవీన్ జ్ఞానేశ్వర్ ప్రస్తుతం వేములవలస ఉప సర్పంచ్‌గా ఉన్నారు. నాగభూషణం 30 ఏళ్ల పాటు ప్రజా సేవలో ఉన్నారు. సుమారు రెండేళ్ల క్రితం టీడీపీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అప్పటి నుంచి బయటకు రాకుండా ఇంటికే పరిమితమయ్యారు. ఆరోగ్యం బాగుండకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజుల కిందట ఆరిలోవలో గల ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం ఆయన ఆత్మహత్య చేసుకున్నారని తెలిసి భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

అశేష జనవాహిని మధ్య గురువారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. నాగభూషణరావు భౌతిక కాయం వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తహశీల్దార్ల కొరత

... 5వ పేజీ తరువాయి

అక్కడ కలెక్టర్ రిలీవ్ చేయలేదు. విశాఖ వచ్చేందుకు అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి పలువురు సీనియర్లు ఆసక్తి చూపుతున్నా.. అక్కడి కలెక్టర్లు ముందుకు రావడం లేదు.

జిల్లాల విభజనలో అనుభవం ఉన్న సీనియర్లు మిగిలిన రెండు జిల్లాలకు వెళ్లిపోయారని, ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రెవెన్యూ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇంకా డీటీల నుంచి తహసీల్దార్లుగా పదోన్నతుల కోసం ఉమ్మడి జిల్లాలో 32 మంది ఎదురుచూస్తున్నారు. వీరిలో ప్రో డీటీలు 16 మంది, పదోన్నతిపై వచ్చినవారు మరో 16 మంది ఉన్నారు. పదోన్నతుల వివాదం కోర్టులో ఉండడంతో చాలాకాలంగా ప్రతిష్టంభన కొనసాగుతుంది. ప్రోడీటీలు, పదోన్నతి డీటీల మధ్య రాజీ కుదిరి కేసు ఉపసంహరించుకునేంత వరకు తహశీల్దార్ల పదోన్నతులు ఇచ్చే అవకాశం లేదని అంటున్నారు.

ఈ వివాదం కొన్నాళ్లు కొనసాగితే జిల్లాలో తహశీల్దార్ల కొరత మరింత పెరుగుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.


అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనకబాబును సత్కరిస్తున్న సభ్యులు

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూముల రీ సర్వే శరవేగంగా కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన కనకబాబు అన్నారు. గురువారం అసోసియేషన్ సభ్యులు జిల్లా కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు. అనంతరం మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లను సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు పైడిరాజు, కృష్ణారావు, రమేశ్, హరీష్, లీల, వెంకటేశ్వరరావు, సూర్యభగవాన్, శివాజీ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జీవో 9 జారీపై హర్షం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నిరుపేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 9 జారీ చేయడం హర్షనీయమని రాష్ట్ర రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి 25 శాతం సీట్లు నిరుపేద పిల్లలకు ఉచితంగా ఇవ్వాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ ఉత్తర్వులను రద్దు చేయగా, కూటమి ప్రభుత్వం ప్రవేశాలకు అవకాశం కల్పిస్తూ.. కొత్తగా జీఓ జారీ చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ జీఓ వల్ల ఎంతోమంది పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన విద్యార్థులు

మహారాణిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు గురువారం ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించారు. వారికి ఎస్ఐఎఫ్‌టీకి చెందిన అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు, మత్స్య సంపద గురించి వివరించారు. అనంతరం మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, సిబ్బంది లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

జ్ఞానాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డు పరిధిలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. గురువారం ఆయన నేరెళ్లకోనేరు ప్రాంతంలో పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం వార్డులోని జనసేన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజలు ఏ సమస్య ఉన్నా..తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరు పతిరావు, గణేష్, వెంకటరావు, గురుమూర్తి, నీలంరాజు, నరేశ్, బుజ్జి, కృష్ణ పాల్గొన్నారు.

పన్నుల వసూలులో ఆర్ఐలు, అడ్మిన్‌ల పనితీరు భేష్


మాట్లాడుతున్న జడ్సీ మల్లయ్యానాయుడు

అల్లిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జోన్ - 4 పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వసూలులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్ల పనితీరు అభినందనీయమని జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యానాయుడు అన్నారు.గురువారం ఆయన జోనల్ కార్యాలయంలో ఆర్ఐలు, సచివాలయ అడ్మిన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నుల వసూలులో మెరుగైన పనితీరు చూపారని కొనియాడారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓలు సన్యాసి పడాల్, అప్పలరాజు, ఆర్ఐలు సీతారాం, వీరబాబు, ఉదయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓల ఆందోళన

మహారాణిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాబాగ్‌లోని జోన్ 4 కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సంధ్యారాణి బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఎల్ఓలు, సూపర్‌వైజర్ల మనోభావాలు దెబ్బతినే విధంగా దురుసుగా ప్రవర్తించడంతో వారు ఆందోళన నిర్వహించారు.

'జీవో 35ను సవరించాలి'


సమావేశంలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబరు 35 వల్ల పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లోని అన్ని కేటగిరీల ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని, తక్షణమే ఆ జీవోను సవరణ చేయాలని పంచాయతీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం నాయకులు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖలో ఇటీవల చేపట్టిన పాలనా సంస్కరణలను స్వాగతిస్తున్నామని, అదే సమయంలో జీవో నెంబరు 35 వల్ల జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో పని చేస్తున్న అధికారులకు ఎంపీడీఓ పదోన్నతిలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.


'జగన్‌పై కేసు నమోదు చేయాలి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కేసు నమోదు చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హోంమంత్రి అనిత తక్షణమే స్పందించి జగన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించరాదన్నారు. జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

మహారాణిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ అన్నారు. గురువారం ఆయన ప్రియాంక విద్యోదయ పాఠశాల గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈస్టు ఏసీపీ కె. లక్ష్మణరావు, కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎం. రవిశంకర్, స్కూల్ డైరెక్టర్ డాక్టర్ భగీరథ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

13న భువనేశ్వరీ దేవి ఆదివాస ఉత్సవం



డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరంలోని చెల్లాయమ్మ తోటలో ఉన్న భువనేశ్వరీ దేవి ఆదివాస ఉత్సవాన్ని ఈనెల 13న నిర్వహించనున్నట్టు సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన డాబా గార్డెన్స్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేపపత్రితో ఆదివాస ఉత్సవం చేస్తామని చెప్పారు.

ఏకాభిప్రాయంతో మద్దతు పలకండి : ఎమ్మెల్యే వంశీకృష్ణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఏప్రిల్ 10, (ఆంధ్రజ్యోతి) : మేయర్, డిప్యూటి మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి జనసేన కార్పొరేటర్లు ఏకాభిప్రాయంతో మద్దతు పలకాలని దక్షిణ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో 11 మంది కార్పొరేటర్లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని, పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ మాటే అందరికీ శిరోధార్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దల్లి గోవింద్, కార్పొరేటర్లు పీతల మూర్తియాదవ్, కందుల నాగరాజు,సాదిక్, లీలావతి, మేరీ జోన్స్, ఉషశ్రీ, పూర్ణశ్రీ, సూర్యకుమారి, కంటిపాము కామేశ్వరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'యాప్' కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

హాజరైతే 15 నుంచి 20 మందిని మాత్రమే కౌంట్ చేస్తోందని, దీనివల్ల పిల్లలకు పూర్తి స్థాయిలో వండి వడ్డించలేని పరిస్థితి ఎదురవుతోందంటున్నారు. అంతేకాకుండా సిబ్బంది హాజరు కూడా ఇదే యాప్‌లో నమోదు చేయాలని, సమయానికి యాప్ ఓపెన్ కాకపోవడంతో కేంద్రానికి ఆలస్యంగా వచ్చినట్టు నమోదవుతోందని వాపోతున్నారు.

ఖర్చుల వివరాలూ యాప్‌లోనే..

కొద్దిరోజుల కిందటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖర్చులకు సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేసే అవకాశం ఉండేది. తాజాగా పిల్లలకు వండి వడ్డించేందుకు అయ్యే ఖర్చుకు సంబంధించిన ప్రతి రూపాయిని యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక సమస్యలతో వివరాలు అప్‌లోడ్ కాకపోతే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పిల్లలు గుండు చేయించుకుని ఉన్నా, ఫొటో తీసే సమయంలో కెమెరావైపు చూడకపోయినా వారి హాజరును లెక్కించడం లేదని, దీంతో రోజువారీ ఖర్చులపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో పిల్లాడికి రోజుకు 75 గ్రాముల బియ్యం ఇవ్వాలి. పది మంది పిల్లలుంటే 750 గ్రాముల బియ్యం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ, కొంతమంది పిల్లల హాజరు తీసుకోకపోవడంతో సమస్యలు వస్తున్నాయంటున్నారు. నెల ప్రారంభంలో ఓపెనింగ్ బ్యాలెన్స్ (గత నెలలో మిగిలిన గుడ్లు, ఇతర సరకులు) వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే, ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో అప్‌లోడ్ చేసిన సరకుల వివరాలకు రెట్టింపు చూపిస్తున్నట్టు చెబుతున్నారు.

ఈ చిక్కులన్నీ తమ పనితీరుపై ప్రభావం చూపిస్తున్నాయని, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. అప్‌డేట్ చేసిన యాప్‌తో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని, వెంటనే పరిష్కార మార్గాలను సూచించాలని వారంతా కోరుతున్నారు.

నిస్తేజంగా అగ్నిమాపక కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

సంభవించినట్టయితే అందులో చిక్కుకున్న వారిని రక్షించడం, మంటలను అదుపుచేయడం కోసం హైడ్రాలిక్ బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనం ఒకటి ఉంది. అలాగే భవనాలు కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు వీలుగా ఐరన్, కాంక్రీట్ కటింగ్ చేసే రెస్క్యూ టెండర్ వాహనం ఒకటి సూర్యాబాగ్‌లోని ఫైర్ స్టేషన్‌లో ఉంది.

గాజువాకలోని ఆటోనగర్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో అక్కడ తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అక్కడి నుంచి ప్రమాదం జరిగిందని సమాచారం అందితే పెదగంట్యాడ లేదా మర్రిపాలెం నుంచి అగ్నిమాపక శకటం వెళ్లాలంటే అరగంటకుపైగా సమయంపడుతుంది. ఆలోగా మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించేస్తాయి. అందుకే ఆటోనగర్‌లో ఒక అద్దె భవనంలో టెంపరరీ ఫైర్ స్టేషన్‌ను అందుబాటులో ఉంచారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలకు సంబంధించి 484 ఫోన్‌కాల్స్ ఫైర్‌స్టేషన్లకు అందాయి. వీటిలో 90 శాతం ప్రమాదాలు పెద్దగా ఆస్తినష్టం లేనివి కాగా45 ప్రమాదాలు మాత్రం ఆస్తినష్టం కలిగించాయి. మరో రెండు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

సమస్యలతో సతమతం

ఫైర్ స్టేషన్లన్నీ సమస్యలతో సతమతమవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 115 మంది సిబ్బంది పనిచేస్తుండగా, ఉద్యోగ విరమణల కారణంగా ఖాళీ అయిన 60 పోస్టులను భర్తీచేయలేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. అలాగే వాహనాల నిర్వహణకు ప్రభుత్వం సరిగా నిధులు ఇవ్వకపోవడంతో పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోల సహాయంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫైర్ స్టేషన్‌లో శకటాలను నీటితో నింపే సదుపాయం లేకపోవడంతో సమీపంలోని జీవీఎంసీ వాటర్ పంప్‌హౌస్‌లు, ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలోని చెరువులు, బావుల నుంచి మోటార్లతో ట్యాంకులు నింపుకోవాల్సి వస్తోంది. భవనాలు కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీలుగా సిమెంట్ కాంక్రీట్, ఐరన్ కటింగ్ చేసేందుకు కేటాయించిన రెస్క్యూ శకటం కాలం చెల్లినది కావడంతో మరమ్మతులకు గురైంది. రిపేరు చేయించడానికి నిధుల్లేక పోవడంతో ఆ వాహనం చాలాకాలంగా మూలనపడి ఉండిపోయింది. ఇవికాకుండా సందుల్లో జరిగే అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు, ప్రముఖులు నగర పర్యటనకు వచ్చినప్పుడు కాన్వాయ్‌లో ఉంచడానికి, ఉత్సవాలు, జాతరలు జరిగినపుడు ప్రమాదం జరిగితే సకాలంలో ఆర్పేందుకు అవసరమైన మిస్ట్ జీపులు దశాబ్దం కిందటివి కావడంతో వాటి సామర్థ్యం తగ్గిపోయింది.

ఉన్న సిబ్బందితోనే సమర్థంగా విధులు

ఎస్.రేణుకయ్య,
జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి.

జిల్లాకు కొత్తగా మూడు అగ్నిమాపక కేంద్రాలు మంజూరయ్యాయి. ఐటీ అభివృద్ధి నేపథ్యంలో ఎండాడలో ఒకటి, మధురవాడ వైపు నగరం విస్తరిస్తుండడంతో కాపులుప్పాడలో ఒకటి, సింహాచలం క్షేత్రానికి భక్తులు రద్దీ పెరుగుతుండడం, తరచూ ఉత్సవాల నిర్వహణ జరుగుతుండడంతో సింహపురి లేఅవుట్‌లో ఒకటి ఏర్పాటుచేయబోతున్నాం. వాటికి నిధులు మంజూరు, టెండర్ ప్రక్రియ కూడా పూర్తవ్వడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఉన్నసిబ్బంది, వనరులతోనే సమర్థంగా విధులు నిర్వరిస్తున్నాం.

ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే 101 నంబర్‌కు మాత్రమే డయల్ చేయాలి. దీనివల్ల సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరుతుంది. కాబట్టి సకాలంలో అగ్నిమాపక శకటం అక్కడకు చేరుకుని మంటలను ఆర్పడానికి అవకాశం ఉంటుంది.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- నేడు మహాధర్నా
- మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు

సిరిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 52 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ చేపట్టే సమరభేరీలో పెద్ద ఎత్తున బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు 20 వరకు గడువు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణ దరఖాస్తులకు ఈ నెల 20 గడువు తేదీ అని ఏపీ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలెక్ట్రిక్ బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, పాసింజర్ కార్, గూడ్స్ ట్రక్, ఫొటో స్టూడియో, సెల్‌ఫోన్ రిపేర్ షాపు, డ్రోన్, ఫ్లవర్ డెకరేషన్ వంటి యూనిట్లకు రుణ సదుపాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. దళితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14న అంబేడ్కర్ 134వ జయంతోత్సవం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఎల్‌ఐసీ భవన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలాంకరణ, అనంతరం ఫుడ్ కోర్టు సమీపంలోబహిరంగ సమావేశం ఉంటుందని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

జీవో-9 జారీపై హర్షం

డాబాగార్డెన్స్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నిరుపేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 9 జారీ చేయడం హర్షనీయమని రాష్ట్ర రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు(తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 44, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 14, క్యారెట్32 దొండకాయలు 22, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)8, మునగకాయలు (కిలో) 30, అల్లం (పాత ది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ(పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28, చిలగడదుంపలు 40, కంద 48, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్క కూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

మద్దిలపాలెంలో రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

- మహిళలు, పాదచారుల పట్ల అనుచిత ప్రవర్తన
- స్థానిక చిరు వర్తకులపై దాడులు
- ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ



కొన్ని రోజుల కిందట గంజాయి బ్యాచ్ దాడితో గాయపడిన సమోస బండి వ్యాపారి (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. జాతీయ రహదారి లక్కీ వైన్‌షాప్ వెనుక ఉన్న భవనంలో పగలూరాత్రీ లేకుండా గంజాయి సేవిస్తూ మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. కళాశాలలు, విధుల నుంచి ఇంటికి వెళ్లే యువతులు, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. బతుకు తెరువుకు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరువర్తకులపై దాడులకు పాల్పడుతున్నారు. రెండు వారాల కిందట తోపుడు బండిపై సమోసాలు, బజ్జీలు అమ్ముకునే పోలినాయుడనే వ్యక్తిని గంజాయి మత్తులో నలుగురు యువకులు చితకబాదారు. దీంతో స్థానికులు పోలినాయుడిని కేజీహెచ్‌కు తీసుకుని వెళ్లగా, 16 కుట్లు వేసి చికిత్స చేశారు. చికిత్స బాధితుడు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయితే పోలీసులు మాత్రం ఈ విషయమై పెద్దగా స్పందించలేదు. చిన్న విషయంగా తీసుకొని రాజీ చేసి పంపించడం గమనార్హం. పోలీసులు మెతక వైఖరి, నిర్లక్ష్యంగ కారణంగా గంజాయి సేవించే యువకులు మరింత రెచ్చిపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి మత్తులో పలువురు యువకులు దారిన పోయేవారిని దుర్భాషలాడడం, దాడులకు పాల్పడడం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వీరి ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కానరావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పలుమార్లు బ్లూకోల్ట్ కానిస్టేబుల్స్ వచ్చి ఆకతాయిలను మందిలించి పంపించడం మినహా చేసేదేమీ లేదని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

దీంతో ఆకతాయిలు తమకు అడ్డే లేదని భావిస్తూ మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాకుండా బ్లూకోల్ట్స్ పోలీసులు మరీ విడ్డూరంగా.. గంజాయి సేవించిన యువకులతో సెల్ఫీలు తీసుకుని వెళ్లిపోతునట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మంచినీరు అడిగాడు.. మెడలో గొలుసు తెంచుకొని పరారయ్యాడు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దాహం వేస్తోంది మంచి నీరు ఇవ్వమని అడిగిన దుండగుడు, మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. గురువారం ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలెంలోని సాయిబాబా ఆలయం దరి ఎంవీపీ భవన్ వెనుక ఉంటున్న శోభారాణి వద్దకు గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఓ చిరునామా అడిగాడు. తనకు తెలియదని చెప్పిన తర్వాత కాస్తా మంచినీరు ఇవ్వమని ఆమెను అడిగాడు. ఆమె తన ఇంటి ఆవరణలో ఉన్న కొళాయిని చూపించింది. ఆ క్షణంలో ఆమె మెడలోని నాలుగు తులాల విలువైన బంగారు గొలుసు తెంచుకుని బయటకు దుండగుడు పరారయ్యాడు. బయట మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై హెల్మెట్ ధరించి సిద్ధంగా ఉండడంతో ఆగంతుకుడు ఆ వాహనం ఎక్కిగా, క్షణాల్లో ఇద్దరూ పరారైపోయారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లో సీసీటీవీలను పరిశీలిస్తున్నారు. ద్వారకా నేర విభాగం సీఐ చక్రధర్ తన సిబ్బందితో విచారణ చేస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వివిధ సందర్భాల్లో ఇబ్బందులకు గురైన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయం పత్రాలను ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబాలకు గురువారం వీటిని అందించారు. ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన మద్దాల రోజాకు రూ. 1,17,876లు, విశాలాక్షినగర్‌కు చెందిన మందపాటి క్రాంతి పల్లవికి రూ. 67,638లు మంజూరయ్యాయి.

కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నక్క కనకరాజు, బొట్ట వెంకటరమణ, కాళ్ల శంకర్, పొత్రకొండ దర్మారావు, బి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్ఎంయూ రాష్ట్ర కోశాధికారి మోహన్



ఆందోళన నిర్వహిస్తున్న మోహన్, ఆర్టీసీ అధికారులు

పెదవాల్తేరు. ఏప్రిల్ 10 : (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఎంయూ రాష్ట్ర కోశాధికారి వీవీవీ మోహన్ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, త్వరలో రాబోయే ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగుల ద్వారా నడపాలని, ఈహెచ్ఎస్ ద్వారాకాకుండా ఉద్యోగులకు పాత విధానంలో వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400లకు పెంచాలని కోరారు. మహిళా ఉద్యోగులకు అడిగిన వెంటనే చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, గ్యారేజ్ ఉద్యోగులు, నాన్-ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంస్థ ద్వారా మాత్రమే జీతాలు చెల్లించాలని, ఆన్ కాల్డ్ డ్రైవర్లకు రోజువారీ వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో చైర్మన్ బి.రవి, అధ్యక్షుడు పి.జి.పతి, వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పార్కు స్థలం అప్పగింతకు చర్యలు



సీపీపీ ప్రభాకరరావును సత్కరిస్తున్న భానునగర్ మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, వెంటనే కబ్జాను తొలగించి పార్కు స్థలాన్ని భానునగర్ అసోసియేషన్ నివాసులకు అప్పగించాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కాలనీ వాసులంతా కలిసి విన్నవించుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడడంతో జీవీఎంసీ నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలంలో కబ్జా చేశారని ఆరోపణ ఉన్న వ్యక్తులతో మాట్లాడమే కాకుండా పునర్ సర్వేను చేయించి పార్కు స్థలాన్ని కాలనీ వాసులకు అప్పగించడానికి సిద్ధపడ్డారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో కాలనీవాసులకు పార్కు స్థలాన్ని అప్పగించనున్నట్టు అధికారులు తెలిపారని, కబ్జా చేసిన పాకను తొలగించనున్నట్టు వెంటనే సీసీపీ ప్రభాకరరావును కలవమని చెప్పారు. దీంతో కాలనీ వాసులంతా గురువారం సీసీపీని కలిసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సీసీపీ మాట్లాడుతూ తమ సర్వే రిపోర్టును జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు అందించి, విషయాన్ని వివరించి వెంటనే పార్కు స్థలాన్ని కాలనీ వాసులకు అప్పగిస్తామని చెప్పారు. దీంతో కాలనీవాసులంతా ఆనందం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టౌన్ సర్వేయర్ ఎస్.తిరుపతిరావు, సచివాలయం డబ్ల్యూపీ ముత్యమాంబలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మినాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ,లక్ష్మి, హైమా,కాలనీవాసులు పాల్గొన్నారు.



సీపీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కాలనీవాసులు

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

- మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, ఇన్‌స్ట్రక్టర్లు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శిక్షణలో నైపుణ్యం పొందాలని మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ వద్ద విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య శాఖ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడంతో వాటి కార్యకలాపాలు ప్రమాణాలు మెరుగుపడాలని సూచించారు. శిక్షణ సమయంలో సాంకేతికలను అభివృద్ధి చేయడానికి వీలవుతుందని వెల్లడించారు. విద్యార్థులు పక్కా ప్రణాళిక, కఠోర సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. మత్స్య శాఖలో అవసరమైన వనరులు ఉన్నా వాటిని మెరుగుపరచడానికి సహకారం అవసరమన్నారు.

మత్స్య శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో దేశాన్ని ముందుకు నడిపించే సత్తా నేటి యువత చేతుల్లో ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శిక్షణ నైపుణ్యాలను తెలుసుకుని వాటి అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలన్నారు. విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని తెలిపారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (నిఫ్ పాట్) సంస్థ మత్స్యకారులకు ఎంతో సహాయకారిగా ఉంటోందన్నారు. మత్స్య సంపదను విదేశాలకు ఎగుమతులు చేస్తూ.. దేశానికి కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆర్జించే అవకాశం ఉందన్నారు.విశాఖ నుంచి నేరుగా చేపలను ఎగుమతి చేసేందుకు ప్రత్యేక కసరత్తు జరుగుతోందని చెప్పారు. మానవ వనరుల అభివృద్ధి ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ కాకినాడ నుంచి వచ్చిన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందిం చారు. మత్స్య శాఖ అభివృద్ధి, కార్యకలాపాల గురించి వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కృష్ణ, విద్యార్థులు, ఎఫ్ఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి డీన్ వాన్ లీవెన్ సూక్తుల పుస్తకం అందజేత



ఏయూ వీసీ రాజశేఖర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోపం, క్రోధం లేని సమాజం కోసం అవిరళ కృషిచేసిన అమెరికాకు చెందిన డీన్ వాన్ లీవెన్ తన జీవితకాలంలో చెప్పిన 72 సూక్తులతో కూడిన విశ్లేషణాత్మక సంచికను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ గురువారం తన కార్యాలయంలో అందుకున్నారు. డీన్ వ్యాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, ఏయూ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ విభాగ విద్యార్థి ఆర్.మణిశంకర్ సంయుక్తంగా రూపొందించిన ఈ సంచికను వీసీకి అందించారు. ఈ సంచికలో డీన్ వ్యాన్ లీవెన్ వివిధ సందర్భాల్లో చెప్పిన 72 సూక్తులను తమదైన శైలిలో వీరు విశ్లేషించారు. ప్రత్యేక సంచిక రూపొందించిన వ్యక్తులను ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో అమెరికాకు చెందిన ప్రివెన్షన్ స్పెషలిస్టు, డీన్ వాన్ లీవెన్ కుమార్తె డియానా క్రాస్, వరల్డ్ వితౌట్ యాంగర్ నేపాల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ డెస్ మర్దన్ బాస్నెట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూతో సంయుక్తంగా డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ వివిధ విద్యార్థులకు ఉపయోగంగా నిలిచే కోర్సులను నిర్వహించాలని భావిస్తున్నట్టు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ ప్రతిపాదన చేశారు.

శాంతిభద్రతలు గాడి తప్పాయి

- వైసీపీ నాయకురాలు నాగమల్లేశ్వరి

మద్దిలపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్ కోసం తర్వాత మాట్లాడొచ్చు ముందు శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు హితవు పలికారు. సొంత జిల్లా, నియోజకవర్గంలో మహిళలపై దాడులు జరిగితే అరికట్టలేని అసమర్థత హోం మంత్రి అనితని విమర్శించారు. అనిత ఫెయిల్యూర్ హోంమంత్రి అని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణే చెప్పారని గుర్తుచేశారు. జడ్ క్యాటగిరి భద్రత కేంద్రం ఇస్తుంది కాని అనిత కాదని తెలుసుకోవాలన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనకబాబును సత్కరిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూముల రీసర్వే శరవేగంగా కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేసన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన కనకబాబు అన్నారు. గురువారం అసోసియేషన్ సభ్యులు జిల్లా కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు. మండల సర్వేయర్లు, గ్రామసర్వేయర్లను సభ్యులుసత్కరించారు.

కళాభారతిలో 12 నుంచి పైడా కౌశిక్ నాటకోత్సవాలు



నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాభారతి నిర్వాహకులు

మద్దిలపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 12 నుంచి పైడా కౌశిక్ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు నాటకోత్సవాల అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ తెలిపారు. కళాభారతిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా ఈ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించనున్న నాటకాలకు వచ్చిన 28 ఎంట్రీలను పరిశీలించి, 9 నాటికలను ప్ర ఎంపిక చేసినట్టు తెలిపారు. మొదటి నాలుగు రోజులు రోజుకు రెండు నాటకాలు, చివరి రోజున

ఒక నాటకం ప్రదర్శించిన తర్వాత అదే రోజు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి రూ. 18 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.12 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు నగదుతో పాటు జ్ఞాపికలు అందిస్తామన్నారు. నాటక ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని, ప్రతీ రోజు ప్రదర్శనలకు వచ్చిన ప్రేక్షకులకు కూపన్లు ఇచ్చి కార్యక్రమం పూర్తి అవగానే డ్రా తీసి మొదటి నలుగురికి బహుమతులు అందిస్తాని చెప్పారు. అలాగే చివరి రోజు మొత్తం కూపన్లు నుంచి డ్రా తీసి ఫైనల్ బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాటకోత్సవాల ప్రధాన కార్యదర్శి జీఆర్కే. ప్రసాద్, పైడా కృష్ణప్రసాద్, బొడ్డేటి జగత్‌రావు, వర్రె నాంచారయ్య పాల్గొన్నారు.

20న చినవాల్తేరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహం పోస్టర్ విడుదల చేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న చినవాల్తేరు రెల్లివీధిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేగ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. గురువారం ఉషోదయ కూడలిలోని ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ కార్యాలయంలో ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ కంచెర్ల అచ్యుతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అచ్యుతరావు మాట్లాడుతూ అంబేడ్కర్ కూర్చున్నట్లుగా ఉన్న కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన సుబ్రహ్మణ్యస్వామి రూపొందించారని తెలిపారు. సినీ హీరో కంచెర్ల ఉపేంద్రబాబు చేతుల మీదుగా ఈ కాంస్య విగ్రహం ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. అదే రోజు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులకు సత్కారం కూడా ఉంటుందని తెలిపారు. సమావేశంలో గంటి మురళి, ఇందిరా ప్రియదర్శిని, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ద్వారకా కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం అవసరమన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వీటిని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన బస్టాపుల్లో చలివేంద్రాల ఏర్పాటుకు స్థానిక నాయకులు ముందుకు రావాలని కోరారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ పీబీఎంకే రాజు, సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఆరిలోవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, , 5 తరగతులను విలీనంపై ఎస్ఎంసీ కమిటీలతో సంతకాలు చేయించాలంటూ ఉపాధ్యాయులపై విద్యాశాఖాధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకు రావడం తగదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యారంగంలో విధ్వంసం సృష్టిస్తున్నారని, ఈ విధానాన్ని విడనాడాలని అన్నారు. లేకుంటే తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు.

16న జైలులో మామిడి తోటలు, పశువుల వేలం

ఆరిలోవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో గల డెయిరీ ఫామ్‌లో ఉన్న 14 పశువులను ఈ నెల 16న ఇదే జైలులో గల పెరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలంపాట వేయనున్నట్టు కారాగారం సూపరింటెండెంట్ ఎం.నమహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.1500 డిపాజిట్ చెల్లించాలన్నారు. ఆవు ఒకటి, గేదె 1, ఆడ దూడలు 5, మగదూడలు 7 ఉన్నాయని తెలిపారు. అలాగే కేంద్రకారాగారం బయట గల మామిడి తోటలను కూడా అదే రోజు బహిరంగ వేలం వేయనున్నట్టు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.1000 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పాట దక్కించుకునే వారు సంబంధి మొత్తాన్ని ఒకే దఫా చెల్లించాలని, లేకుటే పాట రద్దుచేసి డిపాజిట్ రుసుమును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు. ఈ బహిరంగ వేలం ప్రక్రియ జైళ్ల ఉపశాఖాధికారి, కోస్తా ప్రాంతం రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

మే 10న లోక్ అదాలత్

మహారాణిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో మే పదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రకటించింది. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో నిర్వహించనున్న ఈ లోక్‌అదాలత్‌లో జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్ మోటారు ప్రమాదాల నష్ట పరిహార కేసులు, సెక్షన్ 138 చట్టం, బ్యాంకు మనీ రికవరీ, ల్యాండ్ అక్విజేషన్, కార్మిక కుటుంబ తగాదాల కేసులు, పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాబ్ ఫెస్ట్‌కు స్పందన

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ ఫెస్ట్ విజయవంతంగా జరిగింది.స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సహకారంతో జరిగిన జాబ్ ఫెస్ట్‌లో 322 మంది విద్యార్థులు పాల్గొనగా, 123 మందికి ఉద్యోగాలు వచ్చాయని కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన తెలిపారు.

మొక్కల పెంపకంలో అవినీతిపై అటకెక్కిన విచారణ

- ఆసక్తి చూపని అధికారులు
- బాధ్యులను వెనకేసుకొస్తున్న వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):

సాగర్‌నగర్‌కు ఆనుకుని సముద్రతీరం షెల్టర్ బెల్ట్‌లో చేపట్టిన సరుగుడు మొక్కల పెంపకంలో జరిగిన అవినీతిపై జరిపిన విచారణ అటకెక్కింది. మొక్కల పెంపకంలో కొందరు అధికారులు, సిబ్బంది చేతివాటంపై విచారణ పూర్తిచేయడానికి ప్రస్తుత అధికారులు ఆసక్తి చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులను రక్షించే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.



సంరక్షణ లేకపోవడంతో కనుమరుగైన మొక్కలు



సాగర్‌నగర్ ఎదురుగా షెల్టర్ బెల్ట్

విశాఖ, భీమిలి బీచ్‌రోడ్డు గుడ్లవానిపాలెం అటవీ బ్లాకు పరిధిలో సాగర్‌నగర్ స్వాగత ద్వారానికి ఎదురుగా తీరంలో 25 ఎకరాల్లో షెల్టర్ బెల్టు ఏర్పాటుకు విశాఖ పోర్టు రూ.40 లక్షల నిధులు మంజూరుచేసింది. మొత్తం 25 వేల సరుగుడు మొక్కల పెంపకానికి రూ.22 లక్షలు, షెల్టర్ బెల్ట్ చుట్టూ ఫెన్సింగ్‌కు రూ.18 లక్షలు ఖర్చుచేశారు. అయితే మొక్కలు నాటిన అటవీశాఖ పెంపకంపై కనీస శ్రద్ధ చూపలేదు. అక్కడ బోర్లు పడడంలేదనే సాకుతో బయటి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేశారు. పాత ఐరన్‌తో ఫెన్సింగ్ వేయడంతో ఇప్పుడు చాలా చోట్ల అది తుప్పుపట్టేసింది. ప్రస్తుతం కొద్దిచోట్ల తప్ప మిగిలిన చోట్ల మొక్కలు కనిపించడంలేదు. దీనిపై గత ఏడాది అక్టోబరులో 'మొక్కలు పేరుతో మొక్కేశారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో స్పందించిన అటవీ శాఖాధికారులు విచారణకు ఆదేశించారు. లోతుగా విచారణ చేపడితే కొందరు అధికారులు, సిబ్బంది ప్రమేయం ఉన్న విషయం బహిర్గతమవుతుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణకు అధికారులు ఆసక్తి చూపడంలేదనే వాదన ఉంది. మొత్తంగా విచారణ వ్యవహారం మూలనడిపోయిందని సిబ్బందే గుసగుసలాడుతున్నారు. దీంతో పోర్టు యాజమాన్యం ఇచ్చిన రూ.40 లక్షలు బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. కాగా ఇంకా మిగిలిన మొక్కలకు వేసవికాలంలో నీరు పోస్తే బతుకుతాయని తెలిసినా అటవీశాఖ అందుకు తగిన ఏర్పాట్లు చేయడం లేదని సమాచారం.

మరింత సుందరంగా రుషికొండ బీచ్: కలెక్టర్



రుషికొండ బీచ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సాగర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రుషికొండ బీచ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్‌లో మరిన్ని వసతులు కల్పించాలని, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నెలకొల్పాలని సూచించారు. అలాగే సందర్శకుల సౌకర్యార్థం ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సాగర్‌నగర్ బీచ్‌ను బ్లూఫ్లాగ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. రుషికొండ బీచ్‌లో మెరైన్ టవర్ పునరుద్ధరణ, మెట్ల నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, తాగునీటి సరఫరా వ్యవస్థ వంటి పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త బుట్టలపై ఎరుపు, ఆకు పచ్చ రంగుల స్టిక్కర్లు అతికించాలని, బీచ్ మెట్ల వెంబడి అందంగా కనిపించేలా పూలకుండీలు (పాట్స్) ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శకుల నుంచి వచ్చే ఫిర్యాదులతో పాటు వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి అదనంగా మరో బాక్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు జగదీష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుధాసాగర్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏడీసీ వర్మకు ఉత్తమ అధికారి అవార్డు



ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి అవార్డు అందుకుంటున్న అదనపు కమిషనర్ వర్మ

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ రాష్ట్రంలో ఉత్తమ అదనపు కమిషనర్ అవార్డు అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పనిచేసే కమిషనర్లు, అదనపు కమిషనర్లలో ఉత్తమ పనితీరు కనబరిచేవారికి బెస్ట్ కమిషనర్, బెస్ట్ అడిషనల్ కమిషనర్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎంఏ ఎస్.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సంప్రదాయ పడవలు మినహా, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

పొలంలో ఆధార్ కార్డులపై దర్యాప్తు

పోలీసులకు అప్పగించిన రెవెన్యూ సిబ్బంది



ఆధార్ కార్డులను పరిశీలిస్తున్న పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరవ గ్రామ శివారు ఎంఈఎస్ పంపుహౌస్ సమీపంలోని పొలాల్లో పెద్ద సంఖ్యలో ఆధార్ కార్డులు లభించిన ఘటనపై పెందుర్తి పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. పొలంలో వందలాది ఆధార్‌కార్డులు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్, పెందుర్తి పోలీసులు ఈ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో ఆధార్‌కార్డుల్ని రెవెన్యూ అధికారులు పోలీసులకు అప్పగించారు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న సర్వేశాఖ ఏడీ సూర్యారావు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వేశాఖ కార్యాలయంలో గురువారం జాతీయ సర్వే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వేశాఖ సహాయ సంచాలకులు కె.సూర్యారావు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో తొలిసారిగా 1802 ఏప్రిల్ 10న కేప్ మెమోరియన్ నుంచి బెంగళూరు వరకు బ్రిటిష్ సర్వేయర్ విలియం లాంప్టన్ సర్వే చేశారన్నారు. ఆ రోజుకు గుర్తుగా ఏటా ఏప్రిల్ 10న దేశంలో జాతీయ సర్వేదినోత్సవం నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టర్ టీబీబీవీ రాజు, డిప్యూటీ సర్వేయర్ వి.కొండలరావు, 11 మండలాల సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

'వరుణ్ బజాజ్'లో రూ.6 కోట్లు స్వాహా

- నలుగురు మేనేజర్ స్థాయి ఉద్యోగులు అరెస్టు



అరెస్టు చేసిన ఉద్యోగులతో పోలీసులు

గాజువాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'వరుణ్ గ్రూపునకు చెందిన 'బజాజ్' విభాగంలో సుమారు ఆరు కోట్ల రూపాయల మేర నిధులను స్వాహా చేశారనే అభియోగంపై నలుగురు మేనేజర్లను గురువారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంస్థలో ఎక్స్ఛేంజ్ వాహనాల లావాదేవీల్లో గాజువాక బ్రాంచ్ ఏరియా సేల్స్ మేనేజర్ బి.చంద్రశేఖర్, గాజువాక రూరల్ డీలర్‌షిప్ ఏరియా జనరల్ మేనేజర్ వడ్డాది అప్పారావు, చోడవరం ఏరియా సేల్స్ మేనేజర్ పి.నారాయణమూర్తి, మాకవరపాలెం బ్రాంచ్ మేనేజర్ కె.రాజాలు అవకతవకలకు పాల్పడినట్టు 'వరుణ్' గ్రూపునకు చెందిన చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మేనేజర్‌గా అధికారాన్ని దుర్వినియోగం చేసి ఎక్స్ఛేంజ్ వాహనాల లావాదేవీల్లో చేతివాటం చూపించినట్టు తేలడంతో నలుగురినీ గురువారం అరెస్టు చేశామని సీఐ చెప్పారు. ఈ కేసుకు సంబంధించి కార్యాలయాల్లో కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎల్జీ పాలిమర్స్ ఘటనలో 200 మందికి అందని సాయం

- విచారణకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీక్ ఘటనకు సంబంధించి 200 మంది బాధితులకు ఇంతవరకూ సాయం అందలేదు. దీనిపై ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గ్యాస్ లీకైన ఘటనలో ఎల్జీ పాలిమర్స్‌కు చుట్టుపక్కల గల వెంకటాపురం, తదితర గ్రామాలకు చెందిన సుమారు పది వేల మందికి అప్పటి ప్రభుత్వం సాయం ప్రకటించింది.మృతుల కుటుంబాలకు రూ.కోటి, మిగిలిన వారికి రూ.10 వేలు వంతున సాయం అందిస్తామని పేర్కొంది. రమారమి 200 మందికి ఇప్పటికీ సాయం అందలేదు. దీనిపై ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేశారు. దీంతోఈ దుర్ఘటనలో బాధితులు ఎంతమంది?, వారిలో ఎంతమందికి సాయం అందింది?, అందని వారెంతమంది?...అందుకు గల కారణాలేమిటి?...అనే అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ యూసీడీ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

విశాఖ ఉక్కుపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టంచేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. విశాఖ ఉక్కును కాదని అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం తగదని స్పష్టం చేసింది. విశాఖ ఉక్కుకు క్యాప్టివ్ మైన్స్ కేటాయించమని అడగకుండా, మిట్టల్ స్టీల్‌కు మైన్స్, పోర్టు కేటాయించాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం దుర్మార్గమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు ఉద్యమిస్తున్నప్పటికీ.. కేంద్రం కుటిల యత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడటం సరికాదని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేదమంత్రాలతో మార్మోగిన సింహగిరి

సింహాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సనాతన వేద సారం భారతావనికి ప్రత్యేకమని తిరుమల వేదపండితులు గుళ్లేపల్లి దత్తాత్రేయ శర్మ అన్నారు. అప్పన్నవార్షిక తిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన వేదపండిత సదస్యంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ సారథ్యంలో జరిగిన వేదపండిత సదస్యంలో వేద మంత్రోచ్ఛరణతో సింహగిరి మార్మోగింది. అనంతరం దేవాలయ పర్యవేక్షణాధికారులను పండితులను సత్కరించారు. సదస్యంలో ద్వారకాతిరుమలకు చెందిన పురిటి సోమశేఖరశర్మ, అనిపెద్ది రామశర్మ, శ్రీశైలానికి చెందిన పృథ్వీకుమార్‌శర్మ, శ్రీకాళహస్తి నుంచి వంగల వెంకట సీతారామాంజనేయ శర్మ, అన్నవరం నుంచి యనమంద్ర వెంకట రామసత్యనారాయణ అవధాని, విజయనగరం పైడితల్లమ్మ, కాణిపాకం, కనకమహాలక్ష్మి అమ్మవారు, సింహాచలం దేవస్థానాలకు చెందిన సుమారు 500 మంది పండితులు పాల్గొన్నారు.



సింహగిరిపై సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

వేణుగోపాలుడిగా సింహాద్రినాథుడు

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి వేణుగోపాలుడిగా సింహగిరి మాడవీధుల్లో తిరువీధిలో విహరించారు. వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా సాయంత్రం గోవిందరాజస్వామిని గోపాలుడిగా అలంకరించి సర్వజన మనోరంజని వాహనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల హరినామస్మరణల నడుమ స్వామి వారి తిరువీధి ఉత్సవం సాగింది.

క్రైం... crime news

చిన్నారిపై వీధి కుక్కల దాడి



వీధి కుక్కల దాడిలో గాయపడిన పూజిత, చేతికి గాయం

సింధియా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి వస్తున్న ఓ చిన్నారిపై వీధికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటన జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లో గురువారం జరిగింది. ప్రకాష్‌నగర్‌కు చెందిన పూజిత (10) మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి. భయంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. చెయ్యి, తొడపై కరిచివేయడంతో సుమారు 14 కుట్లు పడ్డాయని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. వార్డులో కుక్కల బెడద దారుణంగా ఉందని, పిల్లలు, వృద్ధులు వీధిలోకి వచ్చేందుకు భయపడుతున్నారని, రాత్రి సమయంలో ఈ పరిస్థితి మరీ భయంకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల ఏరివేత చేపట్టాలని కోరుతున్నారు.

భీమిలి బీచ్‌లో ఉప్పల్ వాసి బలవన్మరణం



రఘురాం మృతదేహం

భీమునిపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం బీచ్ రోడ్డులో హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఎస్.రఘురామ్ (52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌కు చెందిన ఎస్.రఘురామ్ మూడు రోజుల క్రితం భీమిలి వచ్చారు. బీచ్‌రోడ్డులో ఒంటరిగా తిరుగుతున్నారు. కాగా రఘురామ్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగి, భీమిలి బీచ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే వెళ్లి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి, పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో 108 వాహనంలో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. రఘురాం కొంతకాలంగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నారని, ఈ క్రమంలో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, మృతుడి కుటుంబసభ్యులు, లేదా అతని గురించి తెలిసిన వారుంటే భీమిలి సీఐ 9440904712, లేదా పోలీసు స్టేషన్ (8933229533) నంబర్లలో సంప్రతించాలన్నారు.

ఇంటర్ విద్యార్థినిపై ప్రేమోన్మాది దాడి

- పెళ్లికి నిరాకరించడంతో ఆమె తల్లిపైనా దాష్టీకం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సీతంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమించానంటూ వేధింపులకు పాల్పడడమే కాకుండా పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు ప్రేమించిన అమ్మాయితో పాటు ఆమె తల్లిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. నాలుగో పట్టణ పోలీసులు బుధవారం అతడిని అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక వికాస్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు అక్కయ్యపాలెం రైల్వే న్యూకాలనీ ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానంటూ కొద్దికాలంగా వెంటపడుతున్నాడు. వీరిద్దరూ ఇంటర్ చదువుతున్నారు. బాలిక ప్రేమను నిరాకరించడమే కాకుండా వేధించవద్దని ప్రాధేయపడింది. ఆవె తల్లి పెళ్లి సంబంధాలు చూస్తోందని తెలుసుకున్న కమలాకర్ బుధవారం రాత్రి బాలిక ఇంట్లోకి వెళ్లి యువతి, ఆమె తల్లితో గొడవ పడ్డాడు. ఇంటి బయటకు పోవాలని వారు ఆగ్రహించడంతో వంట గదిలోకి వెళ్లి కత్తిని తెచ్చి ఇద్దరిపై దాడి చేశాడు. తల్లి మెడ, కడుపులో పొడిచాడు. బాలిక పీక నొక్కి చంపడానికి ప్రయత్నించాడు. వారు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు రక్షించారు. గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బుధవారం రాత్రి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేసి, నిందితుడు కమలాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్టు

గాజువాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో గొలుసు దొంగతనాలు చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్టు గాజువాక పోలీసులు తెలిపారు. గత నెల 28న పాతగాజువాక దరి పంతులుగారి మేడ సమీపంలో మహిళ మెడలోంచి బంగారు చైను బలవంతంగా లాక్కున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేసిఅక్కయ్యపాలేనికి చెందిన ఈర్ల వినయ్‌కుమార్ అలియాస్ బియ్యం (26), కొబ్బరితోటకి చెందిన కిల్లి తరుణ్‌కుమార్ అలియాస్ లడ్డు (23), సీకు కిశోర్ అలియాస్ మాస్ (23)లు ఈ చోరీ చేసినట్టు గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి ద్విచక్రవాహనం, రూ.1,500 స్వాధీనం చేసుకున్నారు.

ద్విచక్రవాహన చోదకుడిపై దాడి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకుడిపై దాడి చేసి, అతడి ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా ఓ వ్యక్తి నగదు బదిలీ చేయించుకున్నాడు. ఈ సంఘటన స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌లో పరిధిలో జరిగింది. రాజీవ్‌నగర్‌కి చెందిన తుమ్మగటి కిశోర్ ఫార్మాసిటీలో పనిచేస్తూ ఖాళీ సమయంలో రాపిడో రైడర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి రైడ్‌లు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనగర్ వద్ద ఓ వ్యక్తి ఆపి, స్టీల్‌ప్లాంట్‌లో డ్రాప్ చేస్తే డబ్బులిస్తానని చెప్పాడు. దీంతో కిశోర్ అతడితో కలిసి కణితి రోడ్డులో వెళ్తుండగా స్టీల్‌ప్లాంట్ శ్మశానం వద్దకు రాగానే వాహనాన్ని ఆపమని అడిగాడు. వెంటనే బైక్ తాళం తీసుకొని, కిశోర్ మొహంపై బలంగా కొట్టాడు. తరువాత అతడి ఫోన్ పే నుంచి రూ.48,100 పంచదార్ల రాఘవేంద్రప్రసాద్ పేరుతో ఉన్న మూడు ఖాతాకు నగదును పంపించాడు. గాయపడిన కిశోర్ సోదరుడి సాయంతో అగనంపూడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని, స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెదవాల్తేరులో చోరీ

- పోలీసుల అదుపులో అనుమానితుడు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధి పెదవాల్తేరులో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని మంగళవారం సాయంత్రం బయటికి వెళ్లి రాత్రి 11 గంటలకు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో చూడగా రూ.15 వేలు, తులం బంగారం పోయినట్టు గుర్తించారు. ఎంవీపీ నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పాత నేరస్తుడిని అనుమానించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ పార్కింగ్‌లో రెండు కార్లు దగ్ధం



వీఎంఆర్‌డీఏ పార్కింగ్‌లో దగ్ధమవుతున్న కార్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్ వెనుక ఉన్న పార్కింగ్ ఏరియాలో ఆ సంస్థకు చెందిన రెండు కార్లు గురువారం అగ్నికి ఆహుతయ్యాయి. పాతబడిన కార్లను పార్కింగ్‌లో వదిలేశారు. ఎలా జరిగిందో గానీ ఉదయం 5.30 గంటల సమయంలో మంటలు వ్యాపించి రెండు కార్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం లేదని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.